www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -146 బుధవారం 9 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts




# మీ తల్లిని కాదు.. నా తల్లిని అన్నారు

- ఆవేశం మీకు కాదు.. నాకుండాలి హరీశ్‌రావుపై స్పీకర్ ఆగ్రహం
- మహిళా ఎమ్మెల్యేలపై దాడికి సమాధానం ?చెప్పాలన్న బీఆర్ఎస్
- ఘటనపై పూర్తి నివేదిక కోరామన్న శ్రీధర్ బాబు
- నివేదిక వచ్చిన తర్వాత చర్యలుంటాయన్న స్పీకర్
- స్పీకర్ పై వ్యాఖ్యలకు సమాధానం చెప్పాలన్న కాంగ్రెస్
- స్పీకర్ అంటే తమకు చాలా గౌరవం ఉందన్న హరీశ్ రావు
- తాతా మధు స్పీకర్‌ను ఉద్దేశించి అలా మాట్లాడలేదు
- స్పీకర్ అలా భావిస్తే విచారం వ్యక్తం చేస్తున్నామన్న హరీశ్
- పోలీసులపై కేటీఆర్ దాడి చేశారన్న మంత్రి సీతక్క
- ఈ వివాదాలను ఇంతటితో ఆపాలన్న ఏలేటి

# దద్దరిల్లిన కేసీఆర్ ఎర్రవల్లి ఫాంహౌస్


## కేసీఆర్ హత్యకు కుట్రలు : కేటీఆర్

ఎర్రవెల్లి టూ బోయిన్‌పల్లివరకు రాజకీయ కాక
కేసీఆర్ ఫామ్‌హౌస్‌ను ముట్టడించిన కాంగ్రెస్ నేతలు
అడ్డుకున్న పోలీసులు.. వ్యవసాయ క్షేత్రం చుట్టూ పహారా
కేసీఆర్‌కు రక్షణగా కదిలిన బీఆర్ఎస్ శ్రేణులు
రెండు పార్టీల పరస్పర నిరసనలతో ఉద్రిక్తత
బీఆర్ఎస్ ముఖ్యనేతలను అరెస్టు చేసిన పోలీసులు
పోలీసుల అదుపులో కేటీఆర్, హరీశ్‌రావు,తదితరులు.
. సాయంత్రానికి విడుదల
పాలక, ప్రతిపక్షాలకు వేర్వేరు నిబంధనలా?: హరీశ్‌రావు



**హైదరాబాద్‌సెప్టెంబర్ 8,(ప్రజావినికిడి):** :అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నేపథ్యంలో సోమవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బ్లాక్ టీషర్ట్స్‌తో మొదలెట్టిన నిరసన.. అటు ఇటు తిరిగి చివరకు మంగళ వారం కేసీఆర్ ఫామ్‌హోస్‌ను కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు ముట్టడించే వరకు వెళ్లింది. ఇరుపార్టీల కార్యకర్తల ఆందోళనలతో ఎర్రవెల్లి రణక్షేత్రంగా మారింది. దళితుడైన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో మర్కుక్ మండలం ఎర్రవెల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రాన్ని ముట్టడించారు. కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో ఎర్రవెల్లికి తరలివచ్చారు. మర్కుక్ మండలం వరదరాజ్‌పూర్ గ్రామం వైపు నుంచి గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు పెద్దఎత్తున ఫామ్‌హౌస్ వైపు కదిలారు. పార్టీ జెండాలు పట్టుకుని, డప్పుల మోతల మధ్య కార్యకర్తలు నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. 'కేసీఆర్ డౌన్ డౌన్' అంటూ ఎర్రవల్లి పరిసరాలు రాజకీయ నినాదాలతో మార్మోగాయి. కాగా వరదరాజపూర్ చౌరస్తాలో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు పోటాపోటీగా రేవంత్‌రెడ్డి, కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేయడంతో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. **భారీగా పోలీసుల మోహరింపు** కాంగ్రెస్ కార్యకర్తలు ఫామ్‌హౌస్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు భారీగా మోహరించారు. ఫామ్‌హౌస్ పరిసర ప్రాంతాల్లో ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేసి కాంగ్రెస్ శ్రేణులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. నిరసనకారులు ముందుకు వెళ్లకుండా పోలీసులు పలు ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించారు. **గజ్వేల్‌లో సైతం ఉద్రిక్తత** కాంగ్రెస్ పార్టీ దళిత నాయకులు, పార్టీ శ్రేణులు గజ్వేల్ నుంచి డప్పులతో ఫామ్ హౌస్ వైపు పెద్దఎత్తున బయల్దేరారు. దాంతో పోలీసులు వారిని ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. అలాగే కేసీఆర్‌కు మిగతాది 2లో...

# తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు..



**హైదరాబాద్‌సెప్టెంబర్ 8,(ప్రజావినికిడి):**తెలుగు రాష్ట్రా ల్లో మంగళవారం తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు, ఉరు ములతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హె చ్చరించింది. తెలంగాణలో అనేక జిల్లాల్లో ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్, ఉత్తర జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకా శం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో మెరుపులు, బలమైన గాలులతో కూడిన వర్షాలు, ఉత్తర కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. మత్స్య కారు లు తీరప్రాంతంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


# బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్-2026

- పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి కోమటిరెడ్డి




# ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌లకు సస్పెన్షన్

● సెషన్ మొత్తానికి సస్పెన్షన్ వేటు ● ఇద్దరు ఎమ్మెల్సీలపై చర్యలకు తీర్మానం




# స్పీకర్‌ను పరామర్శించిన సిఎం రేవంత్..




# శాఖలను సమూలంగా మార్చాలని అధిష్టానానికి చెప్పా...

- నాకు మంత్రి పదవి ఇవ్వడం అధిష్టానం నిర్ణయం
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడి




# తెలంగాణలో 17 మంది డిఎస్పీల బదిలీ



# మీ తల్లిని కాదు.. నా తల్లిని అన్నారు

**హైదరాబాద్, సెప్టెంబర్ 8,(ప్రజావినికిడి) :** రాష్ట్ర అసెంబ్లీ ప్రాంగణంలో సోమవారం ఉదయం జరిగిన ఘటనలపై మంగళవారం కూడా సభలో వాగ్యుద్ధం జరిగింది. ఆవేశం మీకు కాదు.. నాకు ఉండాలి అంటూ..ఒక దశలో స్పీకర్ ప్రసాద్‌కుమార్.. హరీశ్‌రావుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండో రోజు సభ ప్రారంభమైన వెంటనే నల్లబ్యాడ్జీలతో బీఆర్ఎస్ సభ్యులు హాజరయ్యారు. సీనియర్ మహిళా సభ్యులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిని అవమానించిన పోలీసులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా సభ్యులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే.. తిరిగి వారిపైనే అక్రమ కేసులు పెట్టారని ఆవేశంగా మాట్లాడారు. రాష్ట్రంలోని యావత్ మహిళలపై జరిగిన దాడిగా దీన్ని పరిగణిస్తున్నామన్నారు. " కలియుగ దుశ్శాసనుడిలా రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. గౌరవ సభ.. కౌరవ సభగా మారింది. ఆనాడు కౌరవులకు పట్టిన గతే రేపు.. కాంగ్రెస్ పార్టీకి పడుతుంది" అని తీవ్రంగా విమర్శించారు. స్పీకర్ ప్రసాద్ కుమార్ జోక్యం చేసుకుని.. హరీశ్‌రావు వ్యాఖ్యలపై అభ్యంతరం తెలిపారు. "మహిళా సభ్యులంటే సభతో పాటు నాకు కూడా గౌరవం ఉంది. మీరు చెబితే నేను వినట్లేదా.. ఎందుకంత ఆవేశం. మీకు కాదు ఆవేశం.. నాకు ఉండాలి. నీ తల్లిని అనలేదు.. నా తల్లిని అన్నారు" అని భావోద్వేగానికి గురయ్యారు. సబితా ఇంద్రారెడ్డి, సునీత, కోవా లక్ష్మి పట్ల తనకు కూడా గౌరవం ఉందన్నారు. నాకున్న ఎనిమిది మంది అక్కా చెల్లెళ్లతో పాటు వారు కూడా తన సోదరీమణులేనని పేర్కొన్నారు. మహిళా సభ్యులపై దురుసు ప్రవర్తనకు సంబంధించి నివేదిక రాగానే చర్యలు తీసుకుంటామని స్పీకర్ స్పష్టంచేశారు. శాసనసభ వ్యవహారాల మంత్రి డి.శ్రీధర్ బాబు మాట్లాడుతూ... మహిళా సభ్యులపై జరిగిన ఘటనపై రిపోర్ట్ ఇవ్వాలని స్పీకర్ పోలీసులను ఆదేశించారని వివరించారు. మహిళల పట్ల గౌరవం మాకూ ఉందన్నారు. తప్పు జరిగితే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. స్పీకర్ పైన అనుచిత వ్యాఖ్యలు చేస్తే బీఆర్ఎస్ సభ్యులు ఎందుకు ఖండించలేదని నిలదీశారు. స్పీకర్‌ను బెదిరించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సభను ఎలా నడపాలనే అంశంపై బెదిరింపు ధోరణిలో మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్ ఇలా చేయొద్దు.. అలా చేయొద్దు అని చెప్పడానికి వాళ్లెవరు..?అని ప్రశ్నించారు. అనుకుంటే.. భావిస్తే ఏంటి.. వీడియోల్లో స్పష్టంగా కనిపిస్తోంది కదా?అని హరీశ్‌రావును ఉద్దేశించి ప్రశ్నించారు... మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడిపై నివేదిక ఇవ్వాలని స్పీకర్ ఆదేశించారు.. స్పీకర్‌పై జరిగినదాన్ని పక్కనపెట్టాలని చెప్పటంతోనే ఆ ఘటనను వీరు ఎంత లైట్‌గా తీసుకుంటున్నారో అర్థమవుతుందని చెప్పారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళా పోలీసుల ముందు బట్టలు విప్పాల్సిన అవసరమేంటని బీఆర్ఎస్ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్ ను దూషించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సోమవారం అసెంబ్లీ గేట్ దగ్గర మహిళా ఎమ్మెల్యేలను ముందు పెట్టింది ఎవరూ.. మహిళా పోలీసుల ముందు బట్టలు విప్పింది ఎవరని ప్రశ్నించారు. స్పీకర్‌ను ఆయన తల్లిని దూషించి ఇప్పుడు లేదని దబాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులపై దాడులు చేయడం సబబేనా అనినిలదీశారు. అసెంబ్లీలో రూల్ తెచ్చిందే మీరు.. మీరే పాటించరా అని విమర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు లకారం భాషతో సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇక, తమ చీర లాగారు.. కొట్టారని బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు చెబుతున్నారు.. నిజంగా మహిళా సభ్యులపై దాడి జరిగితే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల అనుచితంగా ప్రవర్తించిన పోలీసులపై కూడా కేసులు పెడతామని చెప్పారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ స్పీకర్‌ను అవమానిస్తే సహించబోమన్నారు. ముందు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ వ్యాఖ్యలపట్ల వారికి కనీస పశ్చాత్తాపమే లేదన్నారు. స్పీకర్ పదవిని అవమానించడం అంటే రాజ్యాంగ వ్యవస్థనే అవమానించడమన్నారు. మహిళా ప్రజాప్రతినిధులు మాకు కూడా సోదరీమణులే.. వారిపై దాడిని ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించమని చెప్పారు. ఒకవైపు మహిళలపై జరిగిన ఘటనపై విచారణ కోరుతూ.. మరోవైపు స్పీకర్‌పై వ్యాఖ్యలను సమర్థించడం ఏ న్యాయం?అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో అణగారిన వర్గాల ప్రజలు కూడా ప్రాణత్యాగాలు చేశారని గుర్తు చేశారు. దళిత వర్గానికి చెందిన వ్యక్తి స్పీకర్ స్థానంలో ఉండడాన్ని బీఆర్ఎస్ జీర్ణించుకోలేక పోతోందా?అని ప్రశ్నించారు. చట్టసభల గౌరవాన్ని కాపాడాల్సిన ప్రజాప్రతినిధులే ఇలా వ్యవహరించడం బాధాకరమన్నారు. దళిత సంఘాలు, ప్రజాసంఘాలు స్పీకర్‌పై వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తు న్నాయని గుర్తు చేశారు. ఇదే అంశంపై ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్, ఎమ్మెల్యే అనురిద్‌రెడ్డి మాట్లాడారు. బీజేపీ సభ్యులు 22ఏపై చర్చించాలని పట్టుబట్టారు. ప్రజా సమస్యలు చర్చకు రావాలని డిమాండ్ చేశారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ పోడియం ముందు బైటాయించారు. మంత్రి జోక్యం చేసుకుని ఆ అంశంపై ప్రత్యేక చర్చ ఉందని చెప్పారు. వారు, వీరు కలిసి లోపాయికారి ఒప్పందంతో స్పీకర్‌పై జరిగిన దాడిని పక్కదారి పట్టిస్తున్నారనిబీజేపీసభ్యులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

# ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌లకు సస్పెన్షన్

**హైదరాబాద్‌సెప్టెంబర్ 8,(ప్రజావినికిడి):** తెలంగాణ రాజకీయాల్లో అసెంబ్లీ ఆవరణలో చోటు చేసుకున్న వివాదం మరో కీలక మలుపు తిరిగింది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై శాసనమండలి సస్పెన్షన్ వేటు వేసింది. ప్రస్తుత వర్షాకాల సమావేశాలు ముగిసే వరకు ఇద్దరినీ మండలి నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. ఇద్దరు ఎమ్మెల్సీలను సస్పెండ్ చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు శాసనమండలిలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఆ తర్వాత శాసనమండలి ఛైర్మన్ మూజువాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించారు. తీర్మానానికి ఆమోదం లభించిన తర్వాత తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిని ప్రస్తుత సెషన్ మొత్తానికి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత మండలి సమావేశాన్ని వాయిదా వేశారు. స్పీకర్‌పై ఎమ్మెల్సీలు చేసిన వ్యాఖ్యల వ్యవహారాన్ని శాసనసభ కూడా తీవ్రంగా పరిగణించింది. తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ తీర్మానం చేసింది. తెలంగాణ వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈ తీర్మానాన్ని శాసనసభలో ప్రవేశపెట్టారు. స్పీకర్ పదవికి గౌరవం తగ్గించేలా వ్యాఖ్యలు చేయడాన్ని శాసనసభ ఖండించింది. సభా మర్యాదలకు విరుద్ధంగా వ్యవహరించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. మహిళల ఎదుట అనుచితంగా ప్రవర్తించారనే ఆరోపణలను కూడా సభ ఖండించింది.

బీఆర్ఎస్ సభ్యుల ప్రవర్తనకు ఆ పార్టీ అధినేత కేసీఆర్ బాధ్యత వహించాలని, స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని తీర్మానంలో పేర్కొన్నారు. అసెంబ్లీ ఆమోదించిన తీర్మానాన్ని శాసనమండలి ఛైర్మన్‌కు పంపించారు. దీనిపై మండలిలో మంత్రి శ్రీధర్‌బాబు మరో తీర్మానం ప్రవేశపెట్టగా.. మూజువాణి ఓటింగ్ అనంతరం ఇద్దరు ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ నిర్ణయం వెలువడింది. అసెంబ్లీ ఆవరణలో జరిగిన ఘటనకు సంబంధించి తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మంగళవారం ఉదయం వారిని అదుపులోకి తీసుకుని విచారించిన తర్వాత కోర్టులో హాజరుపరిచారు. అయితే నాంపల్లి కోర్టు పోలీసుల రిమాండ్ అభ్యర్థనను తిరస్కరించింది. వ్యక్తిగత పూచీకత్తుతో విడుదల చేయాలని ఆదేశిస్తూ.. ఒక్కొక్కరు రూ.10 వేల పూచీకత్తుతో పాటు రెండు ష్యూరిటీలు సమర్పించాలని సూచించింది. కోర్టు ఆదేశాల మేరకు ష్యూరిటీలు సమర్పించిన తర్వాత ఇద్దరు ఎమ్మెల్సీలు విడుదలయ్యారు.

కోర్టు నుంచి విడుదలైన తర్వాత ఇద్దరు ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలు శాసనమండలికి హాజరయ్యారు. వారు సభలోకి రావడంపై అధికారపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తాతా మధు, నవీన్ రెడ్డిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. ఈ పరిణామాల మధ్యే సస్పెన్షన్ తీర్మానం మండలి ముందుకు వచ్చింది. తమ పార్టీ ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ వేటు వేయడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకించింది. తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలను నిబంధనలకు విరుద్ధంగా సస్పెండ్ చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మండలి ఆవరణలో ఆందోళన చేపట్టారు. సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ బైఠాయించారు. ప్రభుత్వం తమ పార్టీ నేతలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.

# దద్దరిల్లిన కేసీఆర్ ఎర్రవల్లి ఫాంహౌస్

(మొదటి పేజీ తరువాయి)

గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులను సైతం పోలీసులు అడ్డుకున్నారు. దీంతో గజ్వేల్, ప్రజ్ఞాపూర్, శ్రీగిరిపల్లి, గణేష్‌పల్లి, అల్లిరాజ్ పేట్, సింగరాయపల్లి చౌరస్తా, గౌరారం, పాములపర్తిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు నిరసనకు దిగారు. దీంతో పోలీసులు ఇరు పార్టీల శ్రేణులను చెదరగొట్టారు. **కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్యేల అడ్డగింత** ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మంగళవారం అసెంబ్లీ నుంచి ఎర్రవెల్లికి బయల్దేరడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసేందుకు వెళ్తున్న వారిని హకీంపేట, బొల్లారం వద్ద పోలీసులు అరెస్టు చేశారు. కేటీఆర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, పద్మారావుగౌడ్, కాలేరు వెంకటేశ్, గూడెం మహిపాల్‌రెడ్డి తదితరులను బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, మాణిక్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి తదితరులను జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టు విషయం తెలియడంతో బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పోలీసు స్టేషన్లకు తరలివచ్చారు. హకీంపేట వద్ద బీఆర్ఎస్ నేతలు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి పర్యవేక్షణలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. మాజీ ముఖ్యమంత్రి నివాసం వద్ద భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా అరెస్టు చేసినట్టు పోలీసు అధికారులు తెలిపారు.

**ఇచ్చిన హామీలపై సమాధానం చెప్పాలి : కేటీఆర్**

ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తే ప్రభుత్వం సమాధానం చెప్పకుండా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై దాడులు, అరెస్టులకు పాల్పడుతోందని కేటీఆర్ ఆరోపించారు. బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. అసెంబ్లీ వద్ద ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించిన తీరును ఖండించారు. నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు, మహిళలకు రూ.2,500, ఆడపిల్లలకు స్కూటీలు వంటి హామీలు ఏమయ్యాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారని అన్నారు. హామీల అమలుపై అసెంబ్లీలో ప్రశ్నించాలని కేసీఆర్ తమకు సూచించారని తెలిపారు. సోమవారం అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకున్నారని, మంగళవారం కేసీఆర్‌ను కలిసేందుకు ఎర్రవెల్లి వెళ్తుంటే అడ్డుకున్నారని విమర్శించారు. రానున్న రోజుల్లో ప్రజలే ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతారన్నారు.

**పాలక పక్షానికి.. ప్రతిపక్షానికి వేర్వేరు నిబంధనలా? : హరీశ్‌రావు**

పాలక పక్షానికి, ప్రతిపక్షానికి వేర్వేరు నిబంధనలు ఉన్నాయా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ నాయకులను ఎర్రవెల్లి వెళ్లకుండా అడ్డుకుంటూ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను మాత్రం అనుమతిస్తున్నారని ఆరోపించారు. తమ పార్టీ అధినేత కేసీఆర్‌ను కలిసే హక్కు తమకు ఉందని, ఎర్రవెల్లి వెళ్లకుండా ఎందుకు అడ్డుకుంటున్నారో పోలీసులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నేతల అరెస్టులతో ఆయా పోలీస్‌స్టేషన్ల వద్ద పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరి నాయకులను వెంటనే విడుదల చేయాలని నినాదాలు చేశారు.

# స్పీకర్‌ను పరామర్శించిన సిఎం రేవంత్..

**హైదరాబాద్ సెప్టెంబర్ 8,(ప్రజావినికిడి):** అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఆయన ఛాంబర్‌లో మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు కలిసి పరామర్శించారు. సోమవారం అసెంబ్లీ ఎదుట జరిగిన పరిణామాల నేపథ్యంలో స్పీకర్‌ను సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కలు కలిశారు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు స్పీకర్‌ను వ్యక్తిగతంగా దూషించటంతో స్పీకర్ గడ్డం ప్రసాద్ సోమవారం కంట తడి పెట్టుకున్న దృశ్యాలు చూసి ముఖ్యమంత్రి ఆవేదన చెందారు. మంగళవారం అసెంబ్లీకి రాగానే స్పీకర్ ఛాంబర్‌కు వెళ్లిన సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టిలు స్పీకర్‌ను పరామర్శించి, ఓదార్చారు. సోమవారం జరిగిన సంఘటనలపై వారిద్దరూ విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అండగా ఉంటుందని, బాధ్యులపై తప్పకుండా తగిన చర్యలు తీసుకుంటుందని స్పీకర్‌కు వారు హామినిచ్చారు.

# శాఖలను సమూలంగా మార్చాలని అధిష్ఠానానికి చెప్పా...

**హైదరాబాద్ సెప్టెంబర్ 8,(ప్రజావినికిడి):** తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో కేబినెట్ విస్తరణ, మంత్రుల శాఖల మార్పుపై ఊహాగానాలు షికారు చేస్తున్న వేళ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. గాంధీ భవన్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం కేబినెట్‌లో ఉన్న మంత్రుల శాఖలన్నింటినీ సమూలంగా పునర్వ్యవస్థీకరించి, కొత్త శాఖలను కేటాయించాలని తాను కాంగ్రెస్ హైకమాండ్‌కు స్పష్టమైన సూచన చేసినట్లు వెల్లడించారు. పీసీసీ అధ్యక్షుడిగా తన పరిధి మేరకు పార్టీ ప్రయోజనాల కోసం ఈ సలహా ఇచ్చానని... దానిపై తుది నిర్ణయం తీసుకోవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అధిష్ఠానం చేతిలోనే ఉందన్నారు. ఇక తనను మంత్రివర్గంలోకి తీసుకునే అంశంపై స్పందిస్తూ... ఆ విషయాలన్నీ అధిష్ఠానం నిర్ణయానికే వదిలేశానని తెలిపారు. ప్రస్తుతం పార్టీని బలోపేతం చేసే బాధ్యత కలిగిన పీసీసీ అధ్యక్షుడిగా నిరంతరం పనిచేస్తున్నానని పేర్కొన్నారు.

# బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్-2026


**హైదరాబాద్,సెప్టెంబర్ 8,(ప్రజావినికిడి):** తెలంగాణ విశిష్ట సంస్కృతి, సంప్రదాయాలకు సజీవ ప్రతీక అయిన బతుకమ్మ పండుగ ప్రాశస్త్యాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయడంతో పాటు యువతలోని సృజనాత్మక ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న 'బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్ 2026'ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సినిమాటోగ్రఫీ, రోడ్లు-భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎఫ్‌డీసీ ఎండీ జి. ముకుంద రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, సెట్విన్ మాజీ చైర్మన్ గిరిధర్ రెడ్డిలతో కలిసి సచివాలయంలో ఈ ఛాలెంజ్ అధికారిక పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ... షార్ట్ ఫిలింలు, బతుకమ్మ పాటలు, సృజనాత్మక వీడియోల ద్వారా తమ ప్రతిభను చాటుకోవాలనుకునే యువ ఫిలిం మేకర్లకు ఈ ఛాలెంజ్ ఒక అద్భుత వేదికగా ఉపయోగపడుతుందన్నారు. బతుకమ్మ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, జానపద కళలు, సంప్రదాయాలతో పాటు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కూడా ప్రతిబింబించేలా షార్ట్ ఫిలింలను రూపొందించవచ్చని తెలిపారు. ఈ పోటీల్లో యువ దర్శకులు, విద్యార్థులు, ఔత్సాహిక కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటాలని ఆకాంక్షించారు.

# గణేశ్ మండపాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి: సజ్జనార్



**హైదరాబాద్‌సెప్టెంబర్ 8,(ప్రజావినికిడి):** గణేష్ మండపాలు ఏర్పాటు చేసే వారు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ స్పష్టం చేశారు. గణేశ్ మండపాల వివరాలను ఉత్సవ నిర్వాహకులు ముందస్తుగానే ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. నిర్వాహకులు పోలీస్‌పోర్టల్. టిఎస్‌పోలీస్.జిఓవి.ఇన్/ ఇన్‌డెక్స్. హెచ్‌టిఎం పోర్టల్‌ను సందర్శించి తమ వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. చివరి నిమిషం వరకు వేచి చూడకుండా అధికారిక పోర్టల్ ద్వారా సమాచారం అందించి హైదరాబాద్ సిటీ పోలీస్ కు సహకరించాలని కోరారు. మండపాల ఏర్పాటు, నిమజ్జన వివరాలు ముందుగానే తెలిస్తే ఆయా ప్రాంతాల్లో పటిష్టమైన బందోబస్తు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, తగిన భద్రతాను పోలీసులు ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు.

# తెలంగాణలో 17 మంది డిఎస్‌పిల బదిలీ



**హైదరాబాద్ సెప్టెంబర్ 8,(ప్రజావినికిడి):** రాష్ట్ర పోలీసు శాఖలో 17 మంది డిప్యూటీ సూపరింటెండెంట్స్ ఆఫ్ పోలీస్ (డిఎస్‌పి)లకు బదిలీలు, పోస్టింగులు కల్పిస్తూ డిజిపి సి.వి ఆనంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డు సిఫారసుల మేరకు ఈ బదిలీలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బదిలీ అయిన అధికారులను సంబంధిత యూనిట్ అధికారులు వెంటనే రిలీవ్ చేసి, కొత్త పోస్టింగ్ ప్రదేశాల్లో విధుల్లో చేరేలా ఆదేశాలు జారీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న డిఎస్‌పి కె. బాలకృష్ణారెడ్డిని మల్కాజిగిరి సైబర్ క్రైమ్స్ ఏసిపిగా నియమించారు. అక్కడ పనిచేస్తున్న ఎస్.జీ. శివశంకర్‌ను డిజిపి కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. ఎస్‌కె. అబ్దుల్ రహ్మాన్‌ను జయశంకర్ భూపాలపల్లి డిసిఆర్‌బి ఫంక్షనల్ వర్టికల్స్ డిఎస్‌పిగా నియమించారు. ఏ. రవి కుమార్‌ను జగిత్యాల డిసిఆర్‌బి ఫంక్షనల్ వర్టికల్స్ డిఎస్‌పిగా పోస్టింగ్ ఇచ్చారు. బి. నందిరామ్ నాయక్‌ను డిజిపి కార్యాలయంలోని డిజి కంట్రోల్ రూమ్ డిఎస్‌పిగా, బి. సోమ్నారాయణ్ సింగ్‌కు టిజిపిఏ డిఎస్‌పిగా పోస్టింగ్ ఇచ్చారు. జె. వెంకటేశ్వర్‌రావును మెదక్ డిసిఆర్‌బి ఫంక్షనల్ వర్టికల్స్ డిఎస్‌పిగా, బి. కిషన్ కుమార్‌కు హైదరాబాద్ సిటీ సెక్రటేరియట్ సెక్యూరిటీ ఏసిపిగా పోస్టింగ్ ఇచ్చారు. ఎల్. రమేశ్ కుమార్‌ను హైదరాబాద్ సిటీ సిటిసి ఏసిపిగా నియమించారు. ఎన్. శ్రీనివాస్‌రెడ్డికిసంగారెడ్డి డిసిఆర్‌బి ఫంక్షనల్ వర్టికల్స్ డిఎస్‌పిగా పోస్టింగ్ ఇచ్చారు. కదరు వెంకట్‌రెడ్డిని టిజిపిఏ డిఎస్‌పిగా నియమించారు. కొమట్ల సుబ్బరామిరెడ్డికి హైదరాబాద్ సిటీ సిసిఎస్ అండ్ డిడి ఏసిపిగా పోస్టింగ్ ఇచ్చారు. ఎస్. సుదర్శన్‌ని హైదరాబాద్ సిటీ సిసిఎస్ అండ్ డిడి ఏసిపిగా నియమించారు. ఎన్. శంకర్‌కుహైదరాబాద్ సిటీ సెక్రటేరియట్ సెక్యూరిటీ ఏసిపిగా పోస్టింగ్ ఇచ్చారు. పీ. విజయ్ కుమార్‌ను వెస్ట్ జోన్ రోడ్ సేఫ్టీ డిఎస్‌పిగా నియమించారు. కె. భాస్కర్‌కు టిజిపిఏ డిఎస్‌పిగా పోస్టింగ్ ఇచ్చారు. ఎం. వెంకట నర్సయ్యను సిఐడి డిఎస్‌పిగా నియమించారు. కొత్తగా పోస్టింగ్ పొందిన అధికారులు తమ రిలీవ్ అనంతరం వెంటనే విధుల్లో చేరి, సంబంధిత ఉన్నతాధికారులకు ఛార్జ్ రిపోర్టులు సమర్పించాలని డిజిపి ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
బుధవారం 9 సెప్టెంబర్ 2026

## నాంపల్లి కోర్టులో ప్రభుత్వానికి చుక్కెదురు..

ఎమ్మెల్సీలు నవీన్ రెడ్డి, తాతా మధుసూదన్‌కు రిమాండ్ తిరస్కరణ,బెయిల్ మంజూరు.



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
నాంపల్లి కోర్టులో ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది.ఎమ్మెల్సీలు నవీన్ రెడ్డి,తాతా మధుసూదన్,లను రిమాండ్‌కు పంపాలన్న పోలీసుల అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది.
ఎమ్మెల్సీలను కోర్టులో హాజరుపరిచిన అనంతరం రిమాండ్‌పై వాదనలు జరిగాయి. ఇరుపక్షాల వాదనలు విన్న నాంపల్లి కోర్టు రిమాండ్‌ను తిరస్కరిస్తూ నిర్ణయం తీసుకుంది.ఈ పరిణామంతో ఎమ్మెల్సీలకు ఊరట లభించగా,ప్రభుత్వ వాదనకు కోర్టులో చుక్కెదురైనట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.అనంతరం సొంత పూచికత్తు,ఇరువురు సాక్షుల షూరిటీతో,ఇరువురు ఎమ్మెల్సీలకు కోర్టు బెల్ ఇవ్వడం శుభ పరిణామంగా బీఆర్ఎస్ శ్రేణులు పరిగణించాయి



## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ

# శంషాబాద్ లో కాంగ్రెస్ ర్యాలీ

మాజీ సీఎం కేసీఆర్,తాతా మధు దిష్టిబొమ్మ దహనం -స్పీకర్ కు బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నేతల డిమాండ్





**శంషాబాద్, (ప్రజావినికిడి): సెప్టెంబర్ 8,** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ శంషాబాద్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. శంషాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ శంషాబాద్ మండల్ అధ్యక్షుడు మహేందర్ ముదిరాజ్, కొత్వల్ గూడ డివిజన్ అధ్యక్షుడు బొబ్బిలి శేఖర్ ముదిరాజ్, పిల్లనగ్రోవి సంజయ్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి, తెలంగాణ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్, టిపిసిసి ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జలపల్లి నరేందర్,రణదీర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.అనంతరం బిఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ శంషాబాద్ జాతీయ రహదారి 44 పై ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్,తాత మధు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన ప్రజాప్రతినిధులు ఒక రాష్ట్ర శాసనసభ స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు



చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. స్పీకర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన తాతా మధు, నవీన్‌రెడ్డిలు వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.తాతా మధుపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆయనను శాసన మండలి నుంచి బర్తరఫ్ చేయడంతో పాటు భవిష్యత్తులో పదేళ్ల పాటు ఎలాంటి పదవికి అర్హత లేకుండా చర్యలు తీసుకోవాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని వారు కోరారు. బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం ఈ వ్యవహారానికి బాధ్యత వహించి ప్రజలకు,స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.అసెంబ్లీ సమావేశాల సమయంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మహిళా నాయకులను ఇబ్బందులకు గురిచేసేలా వ్యవహరించి,

ఆ ఘటనలను కాంగ్రెస్ పార్టీపైకి నెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని నాయకులు ఆరోపించారు. రాజకీయాల్లో వ్యక్తిగత విమర్శలకు, కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకునే వ్యాఖ్యలకు తావు ఉండకూడదని అన్నారు.హరీశ్‌రావు పైనా కాంగ్రెస్ నాయకులు తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.ఈ కార్యక్రమంలో సనమ్ శ్రీనివాస్ గౌడ్,రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నాగేందర్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు శేఖర్ యాదవ్, కోటేశ్వర్ గౌడ్, రవినాయక్, ఆంజనేయులు, ప్రభాకర్ గౌడ్, లింగం,గోపాల్ నాయక్,సతీష్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ గొరిగే పృద్వి గౌడ్,సులోచన, ధనుంజయ్, ఇంద్రాపాల్, ప్రవీణ్,మన్నే మహేందర్, కాలేదు భాయ్, గోవర్ధన్ రెడ్డి, శ్రీధర్ యాదవ్, భాషా భాయ్, ప్రభాకర్ యాదవ్, దిద్యాల యాదగిరి, ఉమామహేష్, ఫకృద్దీన్, ప్రభాకర్, టీ.సాయి ముదిరాజ్, పాల్సన్, నజీర్ భాయ్,మీట్టు,టీ అశోక్,ఫక్రుద్దీన్, బంగారం కుమార్,మహేష్ గౌడ్,చందు యాదవ్,సాయి కుమార్,ఇమ్రాన్ ఇలియాస్,కిరణ్ గౌడ్,శ్రీనివాస్ యాదవ్,ఎన్ ఎస్ యు ఐ నాయకులు మణి,బన్నీ,బిట్టు అభి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గణేశ ఉత్సవాలా..

# గల్లీల్లో గందరగోళమా..?

గణేష్ ఆగమన్ పేరుతో..
ప్రజలు ఆగమాగం
ఊరేగింపులతో ట్రాఫిక్ జామ్ లు..
రోడ్లపై నరకం..
బ్యాండ్ బాజాలతో భక్తి రాదు..
ప్రజల చెవులు పగలగొట్టడం తప్పా.?
మండపాల పేరుతో గల్లీలు బంద్..
అంబులెన్స్ లకు దారేది.?
భక్తి పేరుతో ప్రజలకు ప్రత్యక్ష నరకయాతనా.?
భక్తా..బల ప్రదర్శనా.? ఆగమన్‌లో విచ్చలవిడి ఖర్చులెందుకు.?
డీజే నిషేధం అంటే పేరు మార్చి ప్యాడ్ బ్యాండ్ సౌండ్ లతో హంగామా
పండుగ భక్తితో జరగాలి,కానీ డిస్కో లైట్లు, భారీ సౌండ్ లతో కాదు
చిన్నారులు, వృద్ధులు, రోగులకు శబ్ద కాలుష్య శిక్ష
పోలీసులు కఠినంగా వ్యవహరించకపోతే 'భక్తి' పేరుతో బీభత్సమే..
హైదరాబాద్‌లో గణేశ్ ఆగమన్, నిమజ్జనం పేరుతో హంగామా..
ట్రాఫిక్ కష్టాలు, శబ్ద కాలుష్యంపై ప్రజల ఆగ్రహం..




**హైదరాబాద్,(ప్రజావినికిడి):**
భక్తి అంటే పూజలు..భక్తి అంటే అన్నదానం..భక్తి అంటే ఆధ్యాత్మిక చింతన..భక్తి అంటే హిందూ ధర్మం,సంస్కృతి అభివృద్ధికి తోడ్పడటం.కానీ ప్రస్తుతం కొందరి నిర్వాహకుల తీరు చూస్తుంటే భక్తి పేరుతో ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేయడమే లక్ష్యంగా మారిందన్న విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. గణేశ్ ఉత్సవాల సందర్భంగా ఆగమన్, నిమజ్జనం పేరుతో భారీ బ్యాండ్లు,ప్యాడ్ బ్యాండ్లు,డీజే తరహా శబ్దాలతో పాటు కళ్ళు పోయేలా ఎల్‌ఈడి ఫోక్సింగ్ లైట్లు నగరవాసుల సహనానికి పరీక్ష పెడుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి.
గల్లీ నుంచి ప్రధాన రహదారి వరకు ఇష్టారాజ్యంగా మండపాలు ఏర్పాటు చేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఆటోలు వెళ్లడానికి కూడా ఇబ్బంది ఏర్పడుతుండగా, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ ఎలా వెళ్లాలి.? అన్న ప్రశ్న తలెత్తుతోంది. మండపాల ఏర్పాటు సమయంలో ప్రజలకు, ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నప్పటికీ గల్లీ నాయకుల కొంతమంది ప్రజాప్రతినిధుల వత్తిడితో నిబంధనలను గాలికి వదిలేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీనితో అనుమతుల విషయంలో నిబంధనలు ఎంతవరకు అమలవుతున్నాయన్నది ప్రశ్నార్థకంగా మారింది.

### డీజేకు పేరు మార్చితే శబ్దం తగ్గుతుందా.?

డీజేలకు అనుమతి లేదనే నిబంధనలను తప్పించుకునేందుకు కొందరు నిర్వాహకులు 'ప్యాడ్ బ్యాండ్' పేరుతో భారీ సౌండ్ సిస్టమ్స్ ఉపయోగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెవులు పగిలేంత శబ్దంతో గంటల తరబడి సౌండ్ పెట్టడం వల్ల చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. శబ్ద కాలుష్య నిబంధనలు అమలు చేయాల్సిన అధికారులు, పోలీసులు ఇలాంటి వ్యవహారాలపై కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం చాలా ఉంది.

### రంగురంగుల లైట్లతోనూ ఇబ్బందులే


భక్తి పేరుతో భారీగా రంగురంగుల లైట్లు ఏర్పాటు చేయడం కూడా కొన్ని ప్రాంతాల్లో వాహనదారులకు ఇబ్బందిగా మారుతోంది. దానితోపాటు ఎల్‌ఈడి ఫోక్సింగ్ లైట్లు ఏర్పాటు చేయడంతో కళ్ళ పైన భరించలేని వెలుతురు పడడంతో కళ్ళు ఒక్క సారిగా చీకటిగా మారుతూ దృష్టి దోషాలు ఏర్పడుతున్నాయి.కళ్లకు ఇబ్బంది కలిగించే విధంగా లైట్లను రోడ్ల వైపు తిప్పడం వల్ల ప్రమాదాలకు అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### భక్తా.. బల ప్రదర్శనా.?

గణేశ్ ఆగమన్, నిమజ్జనం కార్యక్రమాల పేరుతో భారీగా డబ్బు ఖర్చు చేయడం,భారీ బ్యాండ్లు,భారీ లైట్లు,భారీ ఊరేగింపులు నిర్వహించడం భక్తి ప్రదర్శనా.? లేక ఆర్థిక,బల ప్రదర్శనా.? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.మరికొన్ని చోట్ల ఆగమన్, నిమజ్జనం సందర్భంగా కొందరు మద్యం సేవించి చిందులు వేస్తున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి.ఇది భక్తి పేరుకు ఎంతవరకు న్యాయం చేస్తుందో నిర్వాహకులే ఆలోచించాలి. మరి ఇంత డబ్బు ఎక్కడి నుండి వస్తుంది.? అన్నదానిపై కూడా అధికారులు దృష్టి పెట్టవలసిన అవసరం చాలా ఉంది.

### భక్తి అంటే నలుగురికీ మంచిని చేయాలి

తన భక్తితో పాటు నలుగురికీ మంచి కలిగేలా పండుగ జరుపుకోవడం సంప్రదాయం. కానీ ప్రస్తుతం కొందరి తీరు కారణంగా భక్తి పేరుతో నలుగురినీ అనేక ఇబ్బంది పెట్టే పరిస్థితి ఏర్పడుతున్నాయి.పండుగ జరుపుకోవడాన్ని ఎవరూ వ్యతిరేకించరు. అయితే ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా, అత్యవసర వాహనాలకు దారి ఉండేలా, శబ్ద కాలుష్యం లేకుండా ఉత్సవాలు నిర్వహించడమే నిజమైన బాధ్యతాయుతమైన భక్తి అన్న విషయం నిర్వాహకులు మర్చిపోకూడదు.
ప్రభుత్వం పోలీసులు కఠినంగా వ్యవహరించక తప్పదు ప్రభుత్వం, పోలీసులు ఇప్పటికైనా కఠినంగా వ్యవహరించి స్పష్టమైన నిబంధనలు అమలు చేయాలి. లేకపోతే ప్రతి సంవత్సరం ఆగమన్, నిమజ్జనం పేరుతో ఇదే గందరగోళం పునరావృతమయ్యే ప్రమాదం ఉంది.భక్తి పేరుతో ప్రజల సహనాన్ని పరీక్షించే పరిస్థితులకు ఇప్పటికైనా చెక్ పెట్టాల్సిన సమయం వచ్చింది.






ప్రజల కమ్యూనిటీ హాల్‌పై కబ్జా కోరలు..

# తాళాలు ఎవరిచ్చారు.?

## కబ్జా ఎలా జరిగింది.?

లోక్‌ఆయుక్త కాలనీ హాల్ అన్యాక్రాంతం..
అధికారుల మౌనం వెనుక మతలబేంటి.?
జీహెచ్‌ఎంసీ ఆస్తిపై కబ్జాదారుల కన్ను..
అసోసియేషన్ లేదు,తాళాలు మాత్రం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో..
ప్రభుత్వ భవనానికి కబ్జా గ్రహణం..
సైదాబాద్ లోక్‌ఆయుక్త కాలనీ కమ్యూనిటీ హాల్‌పై అక్రమ ఆధిపత్యం..
కబ్జా దందాకు అధికారుల అండదండలా.?
ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా పట్టించుకోని
మలక్‌పేట్ సర్కిల్ అధికారులు..
ప్రజల ఆస్తి.. కబ్జాదారుల సొంతమా.?
పదేళ్లుగా అసోసియేషన్ లేదు..అయినా హాల్‌పై ప్రైవేటు పెత్తనం..
కమ్యూనిటీ హాల్ కబ్జా.. అధికారులు ఖామోష్
మలక్‌పేట్ డిప్యూటీ కమిషనర్ మౌనంపై స్థానికుల అనుమానాలు..
జీహెచ్‌ఎంసీ ఆస్తికి రక్షణేది.?
కబ్జాదారుల చేతుల్లోకి తాళాలు.. అధికారుల తీరుపై ఆగ్రహం..
కబ్జాదారులకు జీహెచ్‌ఎంసీ ద్వారాలు తెరిచిందా.?
ప్రజల కోసం నిర్మించిన కమ్యూనిటీ హాల్‌పై అక్రమ ఆధిపత్యం..
కబ్జా కళ్ల ముందే.. అధికారులు నిద్రమత్తులో
లోక్‌ఆయుక్త కాలనీ కమ్యూనిటీ హాల్‌పై చర్యలేవీ.?



**మలక్ పేట్, (ప్రజావినికిడి):** ప్రజల సౌకర్యం కోసం నిర్మించిన ప్రభుత్వ ఆస్తులు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల స్థానికుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చార్మినార్ జోన్, మలక్‌పేట్ సర్కిల్‌లో సైదాబాద్ కాలనీలో ఉన్న లోక్‌ఆయుక్త కాలనీ కమ్యూనిటీ హాల్ ప్రస్తుతం అన్యాక్రాంతమైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజల ఉపయోగం కోసం నిర్మించిన ఈ భవనం ఇప్పుడు కొందరి ఆధీనంలో ఉండటం వెనుక అధికారుల నిర్లక్ష్యమా.? లేక తెరవెనుక వ్యవహారాలున్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### ప్రజల కోసం నిర్మిస్తే.. కబ్జాదారుల కోసం వదిలేశారా.?

సుమారు 12 ఏళ్ల క్రితం జీహెచ్‌ఎంసీ తన సొంత నిధులతో కాలనీ వాసుల అవసరాల కోసం కమ్యూనిటీ హాల్‌ను నిర్మించినట్లు స్థానికులు చెబుతున్నారు. కొంతకాలం కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యకలాపాలు కొనసాగగా, సుమారు పదేళ్ల క్రితమే ఆ అసోసియేషన్ గడువు ముగిసిందని పేర్కొంటున్నారు. అప్పటి నుంచి కొత్త అసోసియేషన్ ఏర్పడకపోయినా కమ్యూనిటీ హాల్‌ను మున్సిపల్ అధికారులు తమ ఆధీనంలోకి తీసుకుని పరిరక్షించాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా పరిస్థితులు మారాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### అసోసియేషన్ లేదు.. మరి తాళాలు ఎవరి చేతుల్లో.?

అసోసియేషన్ లేకపోతే కమ్యూనిటీ హాల్ తాళాలు మున్సిపల్ అధికారుల వద్దే ఉండాలని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కానీ ప్రస్తుతం తాళాలు కొందరు వ్యక్తుల చేతుల్లోకి ఎలా వెళ్లాయి.? వారికి భవనాన్ని ఉపయోగించే అధికారం ఎవరు ఇచ్చారు.? జీహెచ్‌ఎంసీ నుంచి ఏమైనా అనుమతి ఉందా.? అన్న ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

### ఫిర్యాదులు ఫైళ్లలోనే,కబ్జా మాత్రం కొనసాగుతూనే

కమ్యూనిటీ హాల్‌ను ఖాళీ చేయించి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని పలుమార్లు మలక్ పేట్ సర్కిల్ అధికారులకు స్థానికులు ఫిర్యాదులు చేసినప్పటికీ ఫలితం కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మలక్‌పేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు విషయం తెలిసినా చర్యలు తీసుకోకపోవడంపై వారు మండిపడుతున్నారు. ఫిర్యాదులు వస్తున్నా పట్టించుకోకుండా అధికారులు మౌనం వహిస్తుండటంతోనే కబ్జాదారులకు మరింత ధైర్యం వస్తోందని ఆరోపిస్తున్నారు.

### మున్సిపల్ అధికారుల మౌనం ఎందుకు.?

ప్రభుత్వ ఆస్తి పరిరక్షణలో అధికారులు ఎందుకు వెనుకడుగు వేస్తున్నారన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. కమ్యూనిటీ హాల్‌పై ఎవరికైనా హక్కు లేదా వినియోగ అనుమతి ఉంటే సంబంధిత పత్రాలను అధికారులు బహిర్గతం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా భవనాన్ని వినియోగిస్తుంటే తక్షణమే ఖాళీ చేయించి జీహెచ్‌ఎంసీ ఆధీనంలోకి తీసుకోవాలని కోరుతున్నారు. కొంతమంది స్థానికులు మాత్రం అధికారులు, సంబంధిత వ్యక్తుల మధ్య అంతర్గత ఒప్పందాలు జరిగాయా.? అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కమ్యూనిటీ హాల్‌ను అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు ఎవరికైనా అధికారులు సహకరించారా.? ప్రభుత్వ ఆస్తి వినియోగంపై ఏమైనా ఆర్థిక లావాదేవీలు జరిగాయా.? అనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే వీటికి సంబంధించిన వాస్తవాలను విజిలెన్స్ అధికారులు స్పష్టమైన విచారణ ద్వారా వెల్లడించాల్సి ఉంది.

### కమిషనర్ కర్ణన్ స్పందించాలి

ప్రజాధనంతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను కబ్జా నుంచి కాపాడాల్సిన బాధ్యత జీహెచ్‌ఎంసీదే. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ కమిషనర్, చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ స్పందించి కమ్యూనిటీ హాల్‌పై సమగ్ర విచారణ జరిపించాలని స్థానికులు కోరుతున్నారు. అనుమతులు లేకుండా ఎవరైనా భవనాన్ని వినియోగిస్తుంటే వెంటనే ఖాళీ చేయించి, తాళాలను మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.
ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ప్రజల కోసం నిర్మించిన భవనం ప్రజలకే దక్కుతుందా.? లేక కబ్జాదారుల ఆధీనంలోనే కొనసాగుతుందా.? అన్నది జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారుల చర్యలతో తేలాల్సి ఉంది.

## తాతా మధును వెంటనే సస్పెండ్ చేయాలి

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎన్. చంద్రశేఖర్



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** అసెంబ్లీ ఎదుట జరిగిన ఘటనలో శాసనసభ స్పీకర్‌ను అసభ్య పదజాలంతో దూషించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ నాయకుడు తాతా మధుపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లేడు చౌదరిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు.రాజ్యాంగబద్ధ వ్యవస్థలో విధులు నిర్వహిస్తున్న పోలీసులపై దౌర్జన్యానికి పాల్పడటం,వారిని అసభ్య పదజాలంతో దూషించడం, చేయి చేసుకోవడం అత్యంత దురదృష్టకరమని ఆయన తీవ్రంగా ఖండించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవస్థలను నిర్వీర్యం చేశారని చంద్రశేఖర్ విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ వ్యవస్థలను పునరుద్ధరించి, పారదర్శకంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు.
ప్రజా ప్రభుత్వం చేపడుతున్న పాలనను ఓర్వలేకే బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వ వ్యవస్థల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులపై దాడులకు పాల్పడుతూ, అసభ్యకర పదజాలంతో దూషిస్తున్నారని ఆయన ఆరోపించారు.స్పీకర్ పదవి రాజ్యాంగబద్ధమైన అత్యున్నత గౌరవప్రదమైన పదవుల్లో ఒకటని,ఆ పదవిలో ఉన్న వ్యక్తిని అవమానించడం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని చంద్రశేఖర్ అన్నారు. పోలీసులపై దౌర్జన్యానికి పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, తాతా మధును పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో పాటు ఆయన శాసనమండలి సభ్యత్వంపై కూడా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జక్కని రవికుమార్, తాలూకా మహిళా అధ్యక్షురాలు పిట్ట రజిత,వివిధ గ్రామాల సర్పంచులు,పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఖబడ్దార్ వీర్లపల్లి శంకర్

కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా
ఎమ్మెల్యే శంకర్ దిష్టిబొమ్మ దహనం
తెలంగాణ జాతిపిత కేసీఆర్‌ను అవమానిస్తే
సహించేది లేదు
మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్
షాద్‌నగర్ చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే
అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఆందోళన



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాన్ని అంకితం చేసి, ప్రత్యేక రాష్ట్రం కోసం కోట్లాది తెలంగాణ ప్రజలను ఏకం చేసిన మాజీ ముఖ్యమంత్రి,బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసినట్లు ఆరోపిస్తున్న అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ షాద్‌నగర్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తీవ్ర నిరసన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ,
కేసీఆర్‌ను అవమానించేలా మాట్లాడటం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్నికించపరచడమేనని అన్నారు. రాజకీయంగా విమర్శలు చేయాలంటే విధానాలు,పాలనపైచేయాలని,వ్యక్తిగతంగా దిగజారి




మాట్లాడటం సరికాదని హితవు పలికారు.తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించడంలో కేసీఆర్ చేసిన కృషిని తెలంగాణ సమాజం ఎన్నటికీ మరిచిపోదని అన్నారు.ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా ఇకపై ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే బీఆర్ఎస్ శ్రేణులు చూస్తూ ఊరుకోబోవని హెచ్చరించారు.
కేసీఆర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి హుందాగా వ్యవహరించాలని,భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మాజీ జెడ్పిటిసిలు,ఎంపిటిసిలు,మాజీ సర్పంచులు, మహిళా నాయకురాలు,అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉప సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు ఎం. గోవర్ధన్ రెడ్డి, ఎం.ప్రకాష్ గౌడ్, జి.అభినవ్ ల అరెస్ట్

**చెక్ పవర్ రద్దు కోరుతూ చలో అసెంబ్లీ పిలుపుతో ముందస్తు అరెస్టు**







**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
ఉప సర్పంచ్‌ల చెక్ పవర్ రద్దు ప్రతిపాదనలను ఖండిస్తూ, ఉపసర్పంచ్ ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్ పిలుపు మేరకు చేపట్టిన చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం ఉందని భావించిన నేపథ్యంలో షాద్ నగర్ నియోజకవర్గ ఉప సర్పంచుల అధ్యక్షులు మల్కయ్య గోవర్ధన్ రెడ్డి, ఫరూక్ నగర్ మండల ఉపసర్పంచ్ ల అధ్యక్షులు ముక్కుపోగుల ప్రకాష్ గౌడ్ రంగారెడ్డి జిల్లా ఉప సర్పంచ్ ల అధికార ప్రతినిధి జి.అభినవ్ లను వివిధ గ్రామాల ఉపసర్పంచులను పోలీసులు మంగళవారం ఉదయం ముందస్తుగా హౌస్ అరెస్టు చేశారు.అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని భంగపరచే ఉద్దేశంతోనే పోలీసులు ఈ ముందస్తు అరెస్టులకు పాల్పడ్డారని స్థానిక నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కాలరాయడం సరికాదని ప్రభుత్వ వైఖరిని ఈ సందర్భంగా తీవ్రంగా ఖండించారు. ఉప సర్పంచ్‌ల చెక్ పవర్ రద్దు నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, చేసుకొని ఎడల ఉప సర్పంచులు నిరాహార దీక్షలు నిరసన కార్యక్రమాలు ఉద్యమాలు చేపట్టాల్సిన పరిస్థితులు వస్తాయి అని తెలియజేశారు.అలాగే అక్రమంగా అరెస్టు చేసిన ఉపసర్పంచ్ సంఘం నాయకులను భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

**స్వరూప్ సింగ్ జేఏసీ కన్వీనర్**



**వాజేడు సెప్టెంబర్ 9,(ప్రజావినికిడి):**
సెప్టెంబర్ 10వ తేదీన ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వాజేడు మండల జేఏసీ కన్వీనర్ స్వరూప్ సింగ్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉద్యోగుల సమావేశంలో స్వరూప్ సింగ్ మాట్లాడుతూ ప్రభుత్వం పెండింగ్ లో ఉంచిన పి ఆర్ సి,ఆరు డి ఏ లను విడుదల చేయాలని మేనిఫెస్టోలో పెట్టిన విధంగా సిపిఎస్ ఉద్యోగులందరినీ ఓపిఎస్ ఉద్యోగులుగా మార్చాలని స్వరూప్ సింగ్ అన్నారు పెండింగ్ లో ఉన్న సమస్యలపై ఖచ్చితమైన హామీ ఇచ్చేవరకు ప్రభుత్వం పై పోరాటం తప్పదని అన్నారు ఉద్యోగులందరూ అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సన్నాహక సమావేశంలో తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కంచు ప్రభాకర్, రామన్న, జానకిరామ్ జేఏసీ మండల కో కన్వీనర్ లు సతీష్ కుమార్, రాజేష్,బాలాజీ, శ్రీకాంత్,రాజు, మైబెల్లీ, చంద్రమౌళి ఉపాధ్యాయులు ఉద్యోగులు పాల్గొన్నారు

# కిలో ఉల్లిగడ్డలు 32 రూపాయలే : మంత్రి నాదెండ్ల మనోహర్

### వచ్చే వారం నుంచి 115 రైతు బజార్లలో విక్రయాలు

**అమరావతి సెప్టెంబర్ 8,(ప్రజావినికిడి):**



ఆంధ్రప్రదేశ్‌లో నిత్యావసరాల ధరల పెరుగుదలతో ఇబ్బంది పడుతున్న సామాన్య ప్రజలకు కూటమి ప్రభుత్వం ఊరట కల్పించే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. వంటింటి భారాన్ని తగ్గించే లక్ష్యంతో, కిలో ఉల్లిపాయలను కేవలం రూ.32కే రాయితీపై అందించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం సోషల్ మీడియా ద్వారా వివరాలు వెల్లడించారు.వచ్చే వారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా 115 రైతు బజార్లు, ప్రత్యేక మొబైల్ కౌంటర్ల ద్వారా ఈ రాయితీ ఉల్లిపాయల విక్రయాలు ప్రారంభమవుతాయని మంత్రి తెలిపారు. ఉల్లితో పాటు, చౌకధరల దుకాణాల (రేషన్ డిపోలు) ద్వారా రాయితీపై కందిపప్పు, పామాయిల్ కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన పేర్కొన్నారు.బహిరంగ మార్కెట్ ధరలతో పోలిస్తే దాదాపు 30 శాతం తక్కువ ధరకే నాణ్యమైన సరుకులను ప్రజలకు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.

# ఎమ్మెల్యే శంకర్ నోటి దురుసుపై బీఆర్ఎస్ శ్రేణుల మండిపాటు.

**కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై చర్యలు తీసుకోవాలి**

**మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పిలుపుతో నియోజకవర్గవ్యాప్తంగా పోలీసులకు బీఆర్ఎస్ శ్రేణుల ఫిర్యాదులు**





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
బీఆర్ఎస్ అధినేత,మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా ఖండించారు.
కేసీఆర్ చావును కోరుతూ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు అత్యంత అభ్యంతరకరమని,రాజకీయాల్లో ఇలాంటి దిగజారుడు వ్యాఖ్యలకు తావు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పిలుపు మేరకు షాద్‌నగర్ నియోజకవర్గంలోని వివిధ మండలాలు,గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు స్థానిక పోలీస్ స్టేషన్లకు వెళ్లి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై ఫిర్యాదులు చేశారు. బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధి పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని, ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. కేసీఆర్‌పై వ్యక్తిగతంగా దూషణలు చేయడం,ఆయనను కించపరిచే విధంగా మాట్లాడటాన్ని బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని నాయకులు తెలిపారు. రాజకీయ విమర్శలకు హద్దులు ఉండాలని,ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతమైన భాషను ఉపయోగించాలని సూచించారు.ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై చట్టప్రకారం తగిన చర్యలు తీసుకునే వరకు బీఆర్ఎస్ శ్రేణులు ప్రజాస్వామ్య పద్ధతిలో తమ నిరసన కొనసాగిస్తాయని నాయకులు స్పష్టం చేశారు.

# కేసీఆర్‌ను ఎలా కాపాడుకోవాలో మాకు తెలుసు: జగదీశ్ రెడ్డి

**కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కేసీఆర్ ఫాంహౌస్ వైపు పంపడం ఏ రకమైన సంస్కారమన్న జగదీశ్ రెడ్డి**

**కేసీఆర్‌ను అంతమొందించేందుకే వెళుతున్నామని ఓ ఎమ్మెల్యే అన్నారని మండిపాటు**

**కేసీఆర్ పైకి కావాలనే నిరసనకారులను పంపుతున్నారని ఆగ్రహం**



**హైదరాబాద్సెప్టెంబర్ 8,(ప్రజావినికిడి):**
తాము బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో పనిచేస్తున్న క్రమశిక్షణ కలిగిన సైనికులమని... కాంగ్రెస్ ప్రభుత్వ అణచివేత చర్యలకు, పోలీసుల అక్రమ అరెస్టులకు తాము ఏమాత్రం భయపడేది లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ దారుణాలను, వైఫల్యాలను ప్రజల కళ్లకు కట్టినట్లు ఎండగడుతుంటే తట్టుకోలేకనే ప్రతిపక్షంపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ నడుస్తుండగా ప్రభుత్వ విప్‌లు, అధికార పార్టీ ఎమ్మెల్యేలను డప్పులు కొట్టుకుంటూ కేసీఆర్ ఫాంహౌస్ వైపు పంపడం ఏ రకమైన సంస్కారమని జగదీశ్ రెడ్డి నిలదీశారు. 'కేసీఆర్‌ను అంతమొందించేందుకే వెళుతున్నాం' అని ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యే బహిరంగంగానే తీవ్ర వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ఆయనపై పోలీసులు వెంటనే సుమోటోగా కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌పైకి కావాలనే నిరసనకారులను పంపుతున్నారని, పోలీసులు వారిని ఆపకపోతే బీఆర్ఎస్ శ్రేణులే రంగంలోకి దిగి తగిన రీతిలో బుద్ధి చెబుతాయని జగదీశ్ రెడ్డి హెచ్చరించారు. కేసీఆర్‌ను కాపాడుకోవడం తమకు, తెలంగాణ సమాజానికి పెద్ద కష్టమేమీ కాదని తేల్చిచెప్పారు.శాసనసభకు వస్తున్న ప్రజాప్రతినిధులను అడ్డుకోవడంపై తాము హైకోర్టును ఆశ్రయించగా... ప్రతిపక్ష ఎమ్మెల్యేలను అసెంబ్లీకి రాకుండా ఎవరు, ఎందుకు అడ్డుకున్నారనే వివరాలను రెండు వారాల్లో సమర్పించాలని అత్యున్నత న్యాయస్థానం ప్రభుత్వాన్ని ఆదేశించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఆ భయంతోనే రాత్రికి రాత్రే బీఆర్ఎస్ నేతలపై తప్పుడు కేసులు నమోదు చేశారని ధ్వజమెత్తారు.నిరుద్యోగులకు ఉద్యోగాలు, ప్రజలకు తాగడానికి, సాగుకు నీళ్లు ఇవ్వలేక, పేదల భూములను గుంజుకుని అమ్ముకుంటూ కాంగ్రెస్ నేతలు సొంత జేబులు నింపుకుంటున్నారని దుయ్యబట్టారు.

# ఎడజర్లపల్లి ఆదివాసీల భూమిని కబ్జాదారుల నుండి రక్షించండి

**రెవిన్యూ గిరిధవర్ కు వినతిపత్రం అందించిన ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి..**

**ఆదివాసీలను భూముల పైకి రాకుండా కత్తులు గొడ్డళ్ళతో అడ్డు పడుతున్న గిరిజనేతరుల పై చర్యలు తీసుకోవాలి..**

**ఎల్ టి ఆర్ చట్టాన్ని భూ స్థాపితం చేసేందుకే రి సర్వే తెచ్చారు..**






**వాజేడు, సెప్టెంబర్ 9,(ప్రజావినికిడి):**
వాజేడు మండలంలో ఆదివాసీల భూములకు రక్షణ కరువైందని ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి ఆరోపించారు. మంగళవారం వాజేడు రెవిన్యూ గిరిధావర్ స్వామి,కి ఎడజర్లపల్లి భూమి సమస్య పై వినతి పత్రం అందజేశారు. మండలం లో ఎడజర్లపల్లి గ్రామానికి చెందిన ఆదివాసీల సాగులో భూములను కబ్జా చేసి కత్తులు గొడ్డళ్లు చేతబట్టి భూముల్లోకి వస్తే చంపేస్తాం అని రౌడీయిజం చేసే గిరిజనేతరుల పైన ఎస్సి ఎస్టీ అట్రాసిటీ, క్రిమినల్ కేసులు పెట్టాలని రెవిన్యూ అధికారులను కోరినట్టు నర్సింహమూర్తి తెలిపారు. ఆదివాసీలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని వారికీ రక్షణ కల్పించాలన్నారుసర్వే నెంబర్ 25,32 లలో ఆదివాసీలకు పట్టాలు ఉన్నప్పటికీ గిరిజనేతరులు కబ్జా చేస్తుంటే రెవిన్యూ అధికారులు నిద్రపోతున్నారని అయన మండిపడ్డారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తూ ఉంటే వాటిని రక్షనించే బాధ్యత రెవిన్యూ అధికారుల పైన లేదా అన్నారు. ప్రభుత్వ భూములన్నిటిని పలహారం లా పంచుతున్న అధికారుల పైన ఉన్నతధికారుల కు ఫిర్యాదు చేయనున్నట్లు అయన తెలిపారు. త్వరలో జరుగనున్న రెవిన్యూ భూముల సర్వే ఎల్ టీ ఆర్ చట్టాన్ని భూ స్థాపితం చేసేదిగా ఉందన్నారు.
రి సర్వే ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వలస గిరిజనేతరుల భూములకు పట్టాలు ఇవ్వడానికే అన్నారు. షెడ్యూల్ ఏరియా లో రి సర్వే ద్వారా గిరిజనేతరుల చేత కబ్జా గురైన ప్రభుత్వ భూములను గుర్తించి స్వాదినం చేసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. షెడ్యూల్ ఏరియాలో ఎన్ని చట్టాలు వచ్చిన ఎల్ టి ఆర్ చట్టాన్ని ఉల్లాంఘించే అధికారం ఉండదు అన్నారు.22 ఏ భూముల జాబితాను విడుదల చేయాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలం లో అక్రమ నిర్మాణాలు గ్రామపంచాయతీ అనుమతి లేకుండా జరుతున్నట్లు ఎంపీడీఓ కృపాకర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. చెరుకూరు, మండపాక, వాజేడు వంటి కొన్ని గ్రామాల్లో గ్రామ పంచాయతీల అనుమతులు లేకుండా వలస గిరిజానేతరులు నిర్మాణాలు చేస్తున్నట్లు ఎంపీడీఓ కు తెలిపారు. అనుమతులు లేని నిర్మాణాలకు యూజర్ పన్ను పేరుతో ఇంటి పన్ను కట్టించడం సరికాదని ఎంపీడీఓ కు వివరించారు. అక్రమ నిర్మాణాలు చేస్తే చర్యలు తీసుకోకుండా పన్నులు కట్టించడం చట్ట విరుద్ధ చర్య అన్నారు.తమ వృత్తి పరమైమ విధివిధానాలు తెలుసుకోకుండా కొందరు పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తున్నట్లు ఎంపీడీఓ కు తెలిపారు.పెసా చట్టం పైన పంచాయతీ కార్యదర్శులకు అవగాహనా కల్పించాలని కోరినట్టు తెలియజేసారు. ఈ కార్యక్రమం లో ఏఎన్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసం నాగరాజు,జిల్లా అధ్యక్షులు ఎట్టి విద్యాసాగర్, నాయకులు తలండి ప్రసాద్, మనోజ్,అశోక్, మల్లి ఖార్జున్, వినోద్,ఏఎన్ఎస్ సోషల్ మీడియా అధికార ప్రతినిధి పాయం అజయ్, తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు విచారణకు హాజరైన యూట్యూబర్ నందన.. అద్దంకిలో కూడా మరో కేసు నమోదు

**సెప్టెంబర్ 8 ,(ప్రజావినికిడి):**



వీసాలు, విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేసి మోసం చేసిందన్న ఆరోపణల కేసులో ప్రముఖ యూట్యూబర్ రమానందన చిక్కుల్లో పడింది. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ లో నమోదైన వీసా చీటింగ్ కేసులో ఆమె తన న్యాయవాదులతో కలిసి పోలీసుల ఎదుట విచారణకు హాజరైంది. విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రమానందన దంపతులు తన వద్ద నుంచి రూ.13 లక్షలు వసూలు చేసి మోసం చేశారని బాధితుడు క్రాంతి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. యూకే నుంచి హైదరాబాద్ చేరుకున్న వెంటనే విచారణకు హాజరుకావాలని పోలీసులు నోటీసులు జారీ చేయడంతో ఆమె పీఎస్‌కు వచ్చింది.మరోవైపు, రమానందనపై ప్రకాశం జిల్లా అద్దంకి పోలీస్ స్టేషన్ లో కూడా మరో వీసా స్కామ్ కేసు నమోదు కావడం సంచలనం సృష్టిస్తోంది. 'డెస్టినీ కన్సల్టెన్సీ' పేరిట వీసా రెన్యువల్, సర్టిఫికెట్ ఆఫ్ స్పాన్సర్‌షిప్ ఇప్పిస్తామని నమ్మించి 2023లో తమ వద్ద భారీగా డబ్బులు వసూలు చేసి మోసం చేశారని బాధితులు పోలీసులను ఆశ్రయించారు. వరుస కేసులు నమోదవ్వడంతో బాధితులను ఇబ్రహీంపట్నం పీఎస్‌కే రావాలని రమానందన కోరినట్లు సమాచారం. దీంతో హైదరాబాద్‌తో పాటు అద్దంకికి చెందిన బాధితులు కూడా భారీగా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు చేరుకుంటున్నారు.

## ఇండోనేషియాలో బద్దలైన అగ్నిపర్వతం.


**సెప్టెంబర్ 8 ,(ప్రజావినికిడి):**



ఇండోనేషియాలోని సుప్రసిద్ధ అనక్ క్రాకటోవా అగ్నిపర్వతం బద్దలవడం తెలిసిందే. సుమారు 25 గంటల పాటు నిరంతరాయంగా లావా, బూడిద వెదజల్లడంతో ఆ ప్రాంతంలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ఈ విస్ఫోటనం కారణంగా ఆకాశమంతా దట్టమైన బూడిద మేఘాలు అలుముకోవడంతో రవాణా వ్యవస్థ, ముఖ్యంగా విమాన సర్వీసులు పూర్తిగా స్తంభించిపోయాయి. ఈ అగ్నిపర్వతం 24 గంటల పాటు ఏకధాటిగా లావాను వెలిగక్కింది. ఈ విస్ఫోటానికి సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.
ఆకాశంలో దట్టమైన బూడిద వ్యాపించడంతో ముందుజాగ్రత్త చర్యగా జకార్తాలోని సోకర్నో-హట్టా, హలిమ్ పెర్దనకుసుమ అంతర్జాతీయ విమానాశ్రయాలతో సహా మొత్తం 8 ఎయిర్‌పోర్టులను తాత్కాలికంగా మూసివేశారు. ఈ నిర్ణయంతో సుమారు 2,300 విమాన సర్వీసులు రద్దు లేదా దారి మళ్లించారు. దీనివల్ల దాదాపు 2.70 లక్షల మంది ప్రయాణికులు విమానాశ్రయాల్లోనే చిక్కుకుపోయారు. ఇండోనేషియా జియోలాజికల్ ఏజెన్సీ లెవెల్-3 (హై అలర్ట్) హెచ్చరికను జారీ చేసింది. స్థానికంగా పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. రాబోయే రోజుల్లో మరిన్ని విస్ఫోటనాలు సంభవించే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. అయితే, ఈ విస్ఫోటనం వల్ల సునామీ ప్రమాదం ఏమీ లేదని అధికారులు స్పష్టం చేయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. 2018లో ఇదే అగ్నిపర్వతం బద్దలైనప్పుడు సంభవించిన సునామీ కారణంగా సుమారు 430 మంది మరణించిన విషయం తెలిసిందే. ప్రస్తుతానికి బూడిద, విష వాయువులు, వేడి రాళ్ల ముప్పు మాత్రమే ఉందని తెలిపారు. పరిస్థితి వేగంగా మారుతున్నందున విమానాశ్రయాల పునఃప్రారంభంపై ఇప్పుడే స్పష్టత ఇవ్వలేమని రవాణా శాఖ మంత్రి దుదీ పుర్వగంధీ పేర్కొన్నారు. ప్రయాణికులు ఎప్పటికప్పుడు తమ విమానయాన సంస్థలను సంప్రదించాలని సూచించారు. పసిఫిక్ 'రింగ్ ఆఫ్ ఫైర్' ప్రాంతంలో ఉండటంతో ఇండోనేషియాలో తరచూ ఇలాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తుంటాయి.

## తెలంగాణ పోలీసు ఉద్యోగ అభ్యర్థులకు దరఖాస్తు గడువు పెంపు

**సెప్టెంబర్ 8,(ప్రజావినికిడి):**




తెలంగాణలో పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు రాష్ట్ర పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) కీలక ప్రకటన చేసింది. కానిస్టేబుల్ స్థాయి పోస్టుల దరఖాస్తు గడువును పొడిగిస్తున్నట్లు బోర్డు వెల్లడించింది. షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 9వ తేదీతో ఈ గడువు ముగియాల్సి ఉండగా, అభ్యర్థుల సౌకర్యార్థం సెప్టెంబర్ 16వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అవకాశం కల్పించింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 7,437 పోస్టుల భర్తీ కోసం టీఎస్ఎల్‌పీఆర్‌బీ జూలై 29న నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇందులో సివిల్ కానిస్టేబుల్ (3,697), ఏఆర్ కానిస్టేబుల్ (1,052), స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్ (1,380), ఫైర్ ఫైటర్ (751), జైల్ వార్డర్ (208), ఎస్ఏఆర్ సీపీఎల్ (24) పోస్టులు ఉన్నాయి.
ఈ ఉద్యోగల కోసం ఇప్పటివరకు 3,38,336 మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, వారిలో 2,88,530 మంది ఫీజు చెల్లించి దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేశారు. ఆధార్ వెరిఫికేషన్ సైతం 95 శాతానికి పైగా పూర్తయినట్లు బోర్డు తెలిపింది. గడువు ముగిసే ఆఖరి రోజుల్లో దరఖాస్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, దీనివల్ల సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశం ఉందని బోర్డు పేర్కొంది. కాబట్టి అభ్యర్థులు చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వీలైనంత త్వరగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు టీఎస్ఎల్‌పీఆర్‌బీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

## నన్నేమైనా అంటే నిజాలు బయటకు వస్తాయి: విజయసాయిరెడ్డి

**సెప్టెంబర్ 8,(ప్రజావినికిడి):**

మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుపై కీలక ప్రకటన చేశారు. దసరా పండుగ ముగిసిన మరుసటి రోజే తన కొత్త పార్టీని ప్రకటిస్తానని వెల్లడించారు. సోమవారం విజయవాడలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీ, వైసీపీలకు ప్రత్యామ్నాయంగా తన పార్టీ నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.
తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు రెండూ కుటుంబ పార్టీలేనని విజయసాయిరెడ్డి విమర్శించారు. ఒకరు అధికారం కోల్పోతే మరొకరు అధికారంలో ఉండాలని చూస్తున్నారని, ఈ నేపథ్యంలోనే రాష్ట్రానికి మూడో ప్రత్యామ్నాయం అవసరమని తాను భావిస్తున్నానని అన్నారు. తన వెనుక ఎంతమంది ఉన్నారనేది రాబోయే ఆరు నెలల నుంచి ఏడాదిలోపు అందరికీ తెలుస్తుందని చెప్పారు. తాను అమరావతికి వ్యతిరేకం కాదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.
ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై ఆయన పరోక్షంగా హెచ్చరికలు జారీ చేశారు. వైసీపీలోని కోటరీ మళ్లీ తనను నమ్మకద్రోహి అంటూ రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తే, తన దగ్గర ఉన్న అనేక నిజాలను బయటపెట్టాల్సి వస్తుందని అన్నారు. తన పార్టీ కేఏ పాల్ పార్టీలా ఉంటుందని మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలపై సాయిరెడ్డి ఘాటుగా స్పందించారు. అసలు బొత్స ఎన్ని పార్టీలు మారారో, వైఎస్ మరణం తర్వాత ఎలా మాట్లాడారో గుర్తుచేసుకోవాలని ఎద్దేవా చేశారు. ప్రజాధనాన్ని దోచుకుని పార్టీ పెడుతున్నారని మంత్రి సత్యకుమార్ చేసిన ఆరోపణలపై బదులిస్తూ.. "నేను ప్రజాధనం దోచుకుంటే నాపై కేసులు పెట్టి అరెస్టు చేయమనండి" అని సవాల్ విసిరారు. తనకు బీజేపీతో మంచి సంబంధాలు ఉన్నాయని, ఆ విషయం బహుశా మంత్రికి తెలియదేమోనని వ్యాఖ్యానించారు.

# పెరుగుతున్న సైబర్ మోసాలు

**సెప్టెంబర్ 8 ,(ప్రజావినికిడి):**



నేటి కాలంలో సైబర్ మోసాలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఎదో ఒకచోట ఎదో ఒక రకంగా వినియోగదారులు, ప్రజలు సైబర్ దాడులకు గురై మోసపోతూనే ఉన్నారు. తాజాగా.. మెటా సంస్థకు చెందిన ఇన్‌స్టాగ్రామ్‌లో కొందరు మోసగాళ్లు ఇతరుల పోస్టులపై కావాలనే తప్పుడు కాపీరైట్ ఫిర్యాదులు చేస్తున్నారు. ఆ తర్వాత వాటిని వెనక్కి తీసుకోవాలంటే డబ్బులు ఇవ్వాలంటూ బెదిరిస్తున్నారు. పదేపదే ఇలాంటి ఫిర్యాదులు వస్తే తమ ఖాతాలు శాశ్వతంగా బ్లాక్ అవుతాయనే భయంతో యూజర్లు వాళ్ల అడిగినంత ఇచ్చుకుంటున్నారు. 15 లక్షల మంది ఫాలోవర్లు ఉన్న ఒక ఇన్‌స్టాగ్రామ్ యూజర్, తన ఖాతాను కాపాడుకోవడానికి ఒక మోసగాడికి 50 డాలర్లు (రూ. 4700) చెల్లించినట్లు బీబీసీకి తెలిపారు. మెటా అప్పీల్ ప్రక్రియకు వారాల సమయం పడుతుందని, ఆ ప్రాసెస్‌లో వెళ్తే తనకు గతంలో వేల రూపాయల ఆదాయం పోయిందని ఆయన అన్నారు. "ఈ పరిస్థితి బాధితులకు ఎంత ఇబ్బందిగా ఉంటుందో మాకు అర్థమవుతోంది, ఇలాంటివి జరగకుండా నిరోధించేలానే మా వ్యవస్థలను తీర్చిదిద్దాం" అని మెటా ప్రతినిధి వివరించారు. "మా విచారణ తర్వాత, సదరు కంటెంట్‌ను మళ్లీ యథాస్థితికి తెచ్చాం. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా ఖాతాలకు అదనపు భద్రతను కూడా కల్పించాం" అని తెలిపారు. కానీ, ఏది నిజమైన ఫిర్యాదో, ఏది నకిలీదో గుర్తించడంలో మెటా పనితీరు పేలవంగా ఉందని క్రియేటర్లు అంటున్నారు. నెలవారీ ఫీజు చెల్లించే క్రియేటర్ల అప్పీళ్లకు తప్ప, సాధారణ యూజర్ల ఫిర్యాదులకు సంస్థ త్వరగా స్పందించడం లేదని వారు బీబీసీతో చెప్పారు. 'లాస్ట్ ఇన్ టైమ్ హిస్టరీ' అనే ఇన్‌స్టాగ్రామ్ పేజీ పాత చారిత్రక చిత్రాలను పోస్ట్ చేస్తూ ఉంటుంది. దీనికి 15 లక్షలకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. దీనిని నడిపే ఓలి ( పూర్తి పేరు చెప్పడానికి ఇష్టపడలేదు), తాను పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉన్న చిత్రాలను లేదా హక్కుదారుల అనుమతి ఉన్నవాటినే పోస్ట్ చేస్తున్నట్లు బీబీసీకి చెప్పారు. అయినా సరే, ఈ ఏడాదిలో అతనికి ఇప్పటివరకు డజన్ల కొద్దీ "స్పష్టంగా నకిలీ" కాపీరైట్ ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదులు వచ్చిన వెంటనే మెటా వాటి వాస్తవాన్ని చెక్ చేయదు. కాబట్టి ఎవరి ఖాతాపైనైనా ఇలా వరుసగా ఫిర్యాదులు వస్తే వాళ్ల అకౌంట్ తాత్కాలికంగా ఆగిపోతుంది. ఒకే ఈమెయిల్ ఐడీ నుంచి ఒకేసారి తన పలు పోస్టులపై కాపీరైట్ స్ట్రైక్స్ వస్తున్నాయని ఓలి చెప్పారు. ఆ తర్వాత ఆ ఫిర్యాదు చేసిన వ్యక్తి, టెలిగ్రామ్ లాంటి ప్రైవేట్ మెసేజింగ్ యాప్‌లోకి రమ్మని మెసేజ్ చేస్తాడు. "వాళ్లు కొంత డబ్బు డిమాండ్ చేస్తారు" అని ఓలి తెలిపారు. ఆ ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలంటే సాధారణంగా కొన్ని వందల డాలర్లు అడుగుతారని చెప్పారు. డబ్బు అడగడం లేదా భవిష్యత్తులో మరిన్ని కాపీరైట్ ఫిర్యాదులు చేస్తామని బెదిరించడం లాంటి మెసేజ్‌లను బీబీసీ కూడా పరిశీలించింది. ఇన్‌స్టాగ్రామ్ తాత్కాలికంగా ఆపేసిన తన అకౌంట్‌ను తిరిగి తెచ్చుకోవడానికి ఓలి చివరికి ఒక మోసగాడికి క్రిప్టోకరెన్సీ రూపంలో 50 డాలర్లు ఇవ్వడానికి ఒప్పుకున్నారు. ఇలా డబ్బులు ఇస్తే నేరగాళ్లను ప్రోత్సహించినట్లే అవుతుందని, కాబట్టి డబ్బులు ఇవ్వొద్దని పోలీసులు బాధితులకు సూచిస్తున్నారు. మెటాను సంప్రదించి ఖాతాను వెనక్కి తెచ్చుకోవాలంటే వారాల కొద్దీ సమయం పడుతుంది కాబట్టి, వేగంగా పనైపోతుందనే ఉద్దేశంతోనే తాను "చివరి ప్రయత్నంగా" డబ్బు కట్టానని ఓలి అన్నారు. కానీ డబ్బు ఇచ్చిన వెంటనే మళ్లీ అతనికి కాపీరైట్ స్ట్రైక్స్ పడ్డాయి. "అదే అత్యంత బాధాకరమైన విషయం" అన్నారు ఓలి. "మనల్ని అంతలా టార్చర్ చేసినవాళ్లకే డబ్బులు సమర్పించుకోవడం, ఆ వెంటనే మళ్లీ వాళ్లు అదే పని చేయడం మనకు ఎంతో నరకంగా అనిపిస్తుంది" అన్నారు. కాపీరైట్ దావాలు ఎక్కువగా రావడంతో ఓలి ఖాతాకు మానిటైజేషన్ ఆగిపోయింది. అంటే, అతని పోస్టులు ఎంత వైరల్ అయినా ఇన్‌స్టాగ్రామ్ నుంచి అతనికి నయాపైసా రాదు. "ఇది వేధింపులా కాదా అని తెలుసుకోవడానికి లేదా అసలు ఏం జరుగుతుందో కనిపెట్టడానికి (మెటా నుంచి) వ్యవస్థలో కనీస విచారణ కూడా జరగడం లేదు" అని ఓలి అన్నారు. చాలా మంది ఇన్‌స్టాగ్రామ్ యూజర్లు కూడా ఇలాంటి అనుభవాలనే పంచుకున్నారు. "క్రియేటర్ల కోసమే తాము ఉన్నామని మెటా పైకి చెబుతున్నప్పటికీ, ఈ ప్రాసెస్‌లో వాళ్లు కనీస సాయం కూడా చేయలేదు. పైగా కస్టమర్ సపోర్ట్ కోసం డబ్బులు కట్టమంటారు" అని 'మోర్బిడ్ క్యూరియాసిటీ' పేజీని రన్ చేస్తున్న అభిన్ టామ్ సెబాస్టియన్ అన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో 'బ్లూ టిక్' (వెరిఫైడ్) కావడానికి మెటా నెలవారీ ఫీజు వసూలు చేస్తుంది, దీనివల్ల లైవ్ చాట్ ద్వారా 24 గంటలూ కస్టమర్ సపోర్ట్ దొరుకుతుంది. "నాకు రావాల్సిన అత్యంత కీలకమైన బ్రాండ్ కాంట్రాక్ట్‌లు వేరే క్రియేటర్ చేతికి వెళ్లిపోవడంతో నేను కోలుకోలేని దెబ్బ తిన్నాను. ఇలాంటివి మళ్లీ జరగవని చెప్పి మెటా నుంచి నాకు ఎలాంటి భరోసా గానీ సపోర్ట్ గానీ దొరకలేదు" అని సెబాస్టియన్ అన్నారు. కాగా, అసలైన కాపీరైట్ హక్కుదారులు లేదా వాళ్లు నియమించుకున్న ప్రతినిధులు మాత్రమే కాపీరైట్ ఉల్లంఘనపై ఫిర్యాదు చేయగలరని ఇన్‌స్టాగ్రామ్ చెబుతోంది. బాధితులు నేరుగా ఆ హక్కుదారులనే సంప్రదించాలని సూచిస్తోంది. ఎదైనమైనా ఇలాంటి మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే పోలీసుల సహాయం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# భారత్‌లో ఈవీల జోరు..

### ఆగస్టులో ఆల్ టైమ్ రికార్డు అమ్మకాలు




భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) విక్రయాలు సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి. 2026 ఆగస్టు నెలలో ఈవీ అమ్మకాలు మునుపెన్నడూ లేని విధంగా ఆల్-టైమ్ గరిష్ఠ స్థాయికి చేరాయి. గత ఏడాదితో పోలిస్తే ఏకంగా 52.9 శాతం వృద్ధితో మొత్తం 2,98,448 యూనిట్ల ఈవీలు అమ్ముడయ్యాయి. దీంతో మొత్తం ఆటోమొబైల్ మార్కెట్‌లో ఈవీల వాటా 9.5 శాతం నుంచి 12.3 శాతానికి పెరిగింది. ఈ మేరకు ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ (ఫాడా) మంగళవారం గణాంకాలను విడుదల చేసింది. ఫాడా నివేదిక ప్రకారం, ద్విచక్ర వాహనాలు, త్రిచక్ర వాహనాలు, ప్యాసింజర్ వాహనాలు, వాణిజ్య వాహనాలు.. ఇలా అన్ని విభాగాల్లోనూ ఆగస్టు నెలలో రికార్డు స్థాయి అమ్మకాలు నమోదవడం విశేషం.

**విభాగాల వారీగా అమ్మకాలు ఇలా..**

ఎప్పటిలాగే, ఈవీ ద్విచక్ర వాహనాల అమ్మకాలు 67.05 శాతం వృద్ధితో 1,83,204 యూనిట్లకు చేరాయి. ఈ విభాగంలో టీవీఎస్ మోటార్ 48,938 యూనిట్లతో అగ్రస్థానంలో నిలవగా, బజాజ్ ఆటో (41,114), ఏథర్ ఎనర్జీ (28,757) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అయితే, ప్రముఖ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ అమ్మకాలు గతేడాదితో పోలిస్తే 29 శాతం తగ్గి 13,852 యూనిట్లకు పరిమితమయ్యాయి.
ఎలక్ట్రిక్ త్రిచక్ర వాహనాల విక్రయాలు 25.28 శాతం పెరిగి 79,846 యూనిట్లుగా నమోదయ్యాయి. ఈ విభాగంలో బజాజ్ ఆటో (13,833) మొదటి స్థానంలో, మహీంద్రా లాస్ట్ మైల్ మొబిలిటీ (12,806) రెండో స్థానంలో నిలిచాయి. ఇక ప్యాసింజర్ వాహనాల (కార్లు) అమ్మకాలు 51.89% వృద్ధితో 30,696 యూనిట్లకు పెరిగాయి. ఈ సెగ్మెంట్‌లో టాటా మోటార్స్ (13,158), మహీంద్రా అండ్ మహీంద్రా (6,464), జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా (4,622) టాప్-3లో ఉన్నాయి. కొత్తగా మార్కెట్లోకి వచ్చిన విన్‌ఫాస్ట్ 2,199, టెస్లా 116 కార్లను విక్రయించాయి.
అన్నింటికంటే వేగంగా వృద్ధి చెందిన విభాగం ఎలక్ట్రిక్ వాణిజ్య వాహనాలే. గతేడాది ఆగస్టులో కేవలం 1,631 యూనిట్లు అమ్ముడవగా, ఈసారి అమ్మకాలు దాదాపు మూడు రెట్లు పెరిగి 4,702 యూనిట్లకు చేరాయి.


**సబ్సిడీలపై ఆధారపడటం లేదు..**

ఈ గణాంకాలపై ఫాడా అధ్యక్షుడు సాయి గిరిధర్ మాట్లాడుతూ.. "భారత్‌లో ఎలక్ట్రిక్ మొబిలిటీకి ఆగస్టు నెల చరిత్రాత్మకం. ముఖ్యంగా వాణిజ్య వాహనాల విభాగం పనితీరు అద్భుతం. అవి పైలట్ ప్రాజెక్టుల దశ నుంచి నేరుగా కొనుగోలు ఆర్డర్ల స్థాయికి చేరాయి. ఇప్పుడు ఈవీల అమ్మకాలు కేవలం సబ్సిడీల మీద ఆధారపడి లేవు. నిర్వహణ వ్యయం తగ్గడం, ఛార్జింగ్ సౌకర్యాలు విస్తరించడం, వినియోగదారుల్లో నమ్మకం పెరగడం వంటి అంశాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. పీఎం ఈ-డ్రైవ్, రాష్ట్రాల విధానాలు కూడా ఇందుకు దోహదపడుతున్నాయి" అని వివరించారు.

# కొబ్బరి వ్యర్థాలతో వాటర్ ఫిల్టర్ తయారీ

### శాస్త్రవేత్తలకే సాధ్యం కాని సమస్యను ఛేదించిన టీనేజర్..





సముద్రాల్లో పేరుకుపోతున్న మైక్రోప్లాస్టిక్ వ్యర్థాలను ఎలా తగ్గించాలి? పర్యావరణ శాస్త్రవేత్తలు ఏళ్లుగా పరిష్కారాల కోసం ప్రయత్నిస్తున్నారు. కానీ ఓ హైస్కూల్ విద్యార్థిని మాత్రం సమస్యకు పరిష్కారాన్ని కొబ్బరి పీచులోనే వెతికింది. హవాయిలోని ఈస్ట్ హొనొలులుకు చెందిన వెరా వాంగ్ చేసిన పరిశోధన ఇప్పుడు అంతర్జాతీయంగా ఆసక్తిని రేపుతోంది. కొబ్బరి వ్యర్థాలతో తయారు చేసిన ఫిల్టర్‌తో మైక్రోప్లాస్టిక్స్‌ను పట్టుకోవడమే కాదు.. వాటిని కరిగించగల ఫంగస్‌ను కూడా ఆమె గుర్తించింది.

**కొబ్బరి వ్యర్థాలతో ప్రయోగం**

క్రైసర్ హైస్కూల్‌లో చదువుతున్న వెరా.. పదో తరగతిలోనే సముద్ర కాలుష్యంపై దృష్టి పెట్టింది. కొబ్బరి పీచు, ఇతర కొబ్బరి వ్యర్థాలతో ఓ వాటర్ ఫిల్టర్‌ను రూపొందించింది. సంప్రదాయ పాలినేషియన్ అల్లిక పద్ధతుల నుంచి స్ఫూర్తి పొందింది. ఈ ఫిల్టర్ నీటిలో తేలియాడే మైక్రోప్లాస్టిక్స్, సన్‌స్క్రీన్ రసాయనాలను సమర్థంగా పట్టుకున్నట్లు గుర్తించింది.

**అసలు సీక్రెట్ ఫంగస్‌లోనే!**

వ్యర్థాలను పట్టుకోవడం మాత్రమే సరిపోదని వెరా భావించింది. ఫిల్టర్‌లో చిక్కుకున్న వ్యర్థాలను పూర్తిగా తొలగించే మార్గంపై పరిశోధన మొదలుపెట్టింది. కొబ్బరి పీచు రంధ్రాల నిర్మాణం గాలి, నీటి ప్రసరణకు అనుకూలంగా ఉంటుందని గుర్తించింది. దీంతో అందులో ఉండే సూక్ష్మజీవులపై దృష్టి పెట్టింది.
హవాయి యూనివర్సిటీ పరిశోధకులతో కలిసి చేసిన ప్రయోగాల్లో కొబ్బరి తంతువులపై సహజంగా పెరిగే కొన్ని ఫంగస్ జాతులు బయటపడ్డాయి. ఇవి సన్‌స్క్రీన్‌లోని కొన్ని రసాయనాలతో పాటు ప్లాస్టిక్ పదార్థాలను కూడా జీవక్రియ ద్వారా విచ్ఛిన్నం చేయగల సామర్థ్యం కలిగి ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు.

**సైన్స్‌లో కొత్త జాతుల జాడ!**

కొబ్బరి పీచులోని సహజ టానిన్ పదార్థాలు ఈ ఫంగస్ పెరుగుదలకు తోడ్పడుతున్నట్లు ప్రయోగాల్లో తేలింది. అంతేకాదు.. వెరా గుర్తించిన కొన్ని ఫంగస్ జాతుల జన్యు నమూనాలు ప్రపంచంలోని అతిపెద్ద జన్యు డేటాబేస్‌లోని రికార్డులతో సరిపోలలేదు. దీంతో ఇప్పటివరకు శాస్త్రవేత్తలకు తెలియని ఫంగస్ జాతులు కావచ్చనే ఆసక్తికర అంశం వెలుగులోకి వచ్చింది.
ఈ పరిశోధనకు హవాయి స్టేట్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ఫెయిర్‌లో మైక్రోబయాలజీ విభాగంలో మొదటి బహుమతి దక్కింది. మెక్ఇనెర్నీ ఫౌండేషన్ స్కాలర్‌షిప్ కూడా లభించింది. ఈ విజయంతో అంతర్జాతీయ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ఫెయిర్‌కు వెరా ఎంపికైంది.

## ఇండియాతో చారిత్రాత్మక పోరుకు

# జపాన్ జట్టు ప్రకటన



ప్రస్తుత టీ20 ప్రపంచ ఛాంపియన్, ఐసీసీ నంబర్ వన్ ర్యాంకర్ అయిన టీమ్ ఇండియాతో సెప్టెంబర్ 22న టోచిగిలోని సానో ఇంటర్నేషనల్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగే చారిత్రాత్మక టీ20 సమరానికి జపాన్ క్రికెట్ బోర్డు.. తమ జట్టును అధికారికంగా అనౌన్స్ చేసింది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నివేదిక ప్రకారం, ఈ మ్యాచ్ ముగిసిన రెండు రోజులకే నగోయాలో ఆరంభమయ్యే స్వదేశీ ఆసియా క్రీడల కోసం ఎంపిక చేసిన స్క్వాడ్‌నే ఈ మ్యాచ్ బరిలోకి దించుతున్నారు. జపాన్ తరఫున అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడు కెండల్ కడోవాకి-ఫ్లెమింగ్ ఈ జట్టు పగ్గాలు చేపట్టనున్నాడు. అతడితో పాటు 50కి పైగా టీ20 మ్యాచ్‌లు ఆడిన అనుభవజ్ఞులైన ఇబ్రహీం తకాహాషి, డెక్లాన్ సుజుకి-మెక్‌కాంబ్ జట్టులో కీలకం కానున్నారు. ఆసియా క్రీడల నిబంధనలను దృష్టిలో ఉంచుకుని ఈ జట్టును సెలెక్ట్ చేయడంతో, ఐసీసీ అర్హత ఉన్నప్పటికీ గేమ్స్ నిబంధనల పరిధిలోకి రాని కొంతమంది ఆటగాళ్లను తప్పించాల్సి వచ్చిందని తెలుస్తోంది. ఈ పరిణామం దేశవాళీ క్రికెట్‌లో అద్భుత ప్రతిభ కనబరిచిన యువ స్పిన్ ఆల్‌రౌండర్ జేక్ కుసుడ-నైర్న్‌కు మార్గం సుగమం చేసింది. 2013లో మొదటిసారి జపాన్‌కు ప్రాతినిధ్యం వహించిన సీనియర్ ఆటగాడు సుయోషి తకాడా మళ్లీ జట్టులోకి రీఎంట్రీ ఇచ్చాడు. స్కూల్ క్రికెట్ బుకాట్సు ప్రోగ్రామ్‌ల ద్వారా వెలుగులోకి వచ్చిన వతారు మియాచి, మకోటో తానియామాలు ఈ లైనప్‌లో చోటు దక్కించుకున్నారు. ఆస్ట్రేలియా దిగ్గజం షేన్ వార్న్ బౌలింగ్ వీడియోలు చూస్తూ లెగ్ స్పిన్ నేర్చుకున్న తానియామా, తన ఆరాధ్య క్రికెటర్ జెర్సీ నంబర్ 23 ధరించి ఆడనున్నారు. ఈ అరుదైన మ్యాచ్ భారత్, జపాన్ దేశాల ద్వైపాక్షిక సంబంధాల 75 సంవత్సరాల వేడుకల్లో భాగంగా 'స్పోర్ట్ 75' పేరుతో నిర్వహిస్తున్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని సనాయ్ తకైచిల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు ఇరు దేశాల ప్రజల మధ్య క్రీడా సంబంధాలను విస్తరించడానికి ఈ వేదిక ఉపయోగపడనుంది. భారత్‌తో పోరుకు ముందు జపాన్ సెప్టెంబర్ 19, 20 తేదీల్లో హాంకాంగ్‌తో రెండు టీ20లలో అమీతుమీ తేల్చుకోనుంది. ఆ తర్వాత ఆసియా క్రీడల్లో భాగంగా సెప్టెంబర్ 24న అఫ్గానిస్తాన్, 26న నేపాల్‌తో తలపడనుంది. మరోవైపు టీమ్ ఇండియా ఈ చారిత్రక పోరు కోసం శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, శివం దూబే, తిలక్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, వైభవ్ సూర్యవంశీలతో కూడిన దుర్భేధ్యమైన జట్టును ప్రకటించింది.

## రూమర్లకు చెక్ పెట్టిన

# రాహుల్..

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2027 మినీ వేలానికి ముందు స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ భవితవ్యంపై నెలకొన్న ఎండ్ కార్డు పడింది. గత 2026 సీజన్ ముగిసిన నాటి నుంచి ఫ్రాంచైజీల మధ్య ఆటగాళ్ల ట్రేడింగ్ గురించి పలు రకాల ప్రచారాలు జరిగాయి. ఇప్పటికే రిషభ్ పంత్ తిరిగి ఢిల్లీ క్యాపిటల్స్ గూటికి చేరగా, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ లక్నో సూపర్ జెయింట్స్ జట్టులోకి వెళ్లే భారీ ట్రేడ్ అధికారికంగా స్పష్టమైంది. ఈ పరిణామాల నేపథ్యంలో రాహుల్ కూడా వేరే ఫ్రాంచైజీలోకి వెళ్తాడనే ఊహాగానాలు జోరందుకున్నాయి. అయితే రాబోయే సీజన్‌లో తాను ఢిల్లీ క్యాపిటల్స్ తరఫునే బరిలోకి దిగుతానని రాహుల్ స్వయంగా తేల్చిచెప్పాడు. ఢిల్లీ క్యాపిటల్స్ సహ యజమాని పార్థ్ జిందాల్ సోషల్ మీడియా వేదికగా రాహుల్‌ను ప్రశంసిస్తూ పెట్టిన పోస్ట్‌తో ఈ చర్చలకు తెరపడింది. రాహుల్‌ను అత్యుత్తమ క్లచ్ ప్లేయర్‌గా అభివర్ణించిన జిందాల్, ఫ్రాంచైజీతో ఇంకా సాధించాల్సింది చాలా ఉందని రాసుకొచ్చాడు. "కేఎల్ రాహుల్ ఢిల్లీ క్యాపిటల్స్‌కు నిజమైన ఆస్తి. జట్టు ప్రయోజనాలను ఎల్లప్పుడూ ముందుంచే వ్యక్తి. రాబోయే సీజన్‌లో ఢిల్లీని గర్వపడేలా చేయడానికి కలిసి శ్రమిస్తాం" అని జిందాల్ పేర్కొన్నాడు. దీనికి రాహుల్ స్పందిస్తూ "థ్యాంక్స్, వచ్చే సీజన్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా" అని బదులిచ్చాడు. దీంతో అతడు ఢిల్లీ క్యాపిటల్స్ జెర్సీలోనే కొనసాగుతాడన్న విషయం అధికారికంగా రూఢీ అయింది. 2025 సీజన్‌లో రూ. 14 కోట్లకు ఢిల్లీలో చేరిన రాహుల్, తొలి ఏడాది 539 రన్స్, 2026 సీజన్‌లో 593 రన్స్ చేసి అద్భుత ఫామ్ కనబరిచాడు. మరోవైపు ముంబై ఇండియన్స్ స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ట్రేడింగ్ వ్యవహారంలో కీలక మలుపు తిరిగింది. సరైన డీల్ కుదరకపోవడంతో హార్దిక్ మరో ఏడాది పాటు ముంబై ఇండియన్స్ జట్టులోనే కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే 2027 సీజన్ కోసం జట్టు నాయకత్వంలో మార్పులు జరగనున్నాయని, కొత్త కెప్టెన్ ఎంపిక ప్రక్రియలో మాజీ సారథి రోహిత్ శర్మ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నాడని తెలుస్తోంది. కెప్టెన్సీ కోల్పోయినప్పటికీ హార్దిక్ జట్టులో ఒక ఆటగాడిగా కొనసాగే అవకాశాలను ఫ్రాంచైజీ పరిశీలిస్తోంది. ఫ్రాంచైజీలు తమ కోర్ గ్రూప్‌ను పటిష్టం చేసుకునే క్రమంలో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. రిషభ్ పంత్ రీఎంట్రీ, రాహుల్ కొనసాగింపుతో ఢిల్లీ క్యాపిటల్స్ మరింత బలంగా మారగా, మిగిలిన జట్లు సైతం సమతుల్యత కోసం ట్రేడింగ్ మార్గాలను అన్వేషిస్తున్నాయి.



# భారత్‌ను చూసి నేర్చుకోండి



### ఆ దేశ మాజీ టెస్టు కెప్టెన్ మిస్బా ఉల్ హక్ సూచన

పాకిస్తాన్ క్రికెట్ బోర్డు అనుసరిస్తున్న తప్పుడు విధానాలపై ఆ దేశ మాజీ టెస్టు కెప్టెన్ మిస్బా ఉల్ హక్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న జట్టు నుంచి ఏడుమంది ప్లేయర్లు, ఇద్దరు కోచ్‌లను ఆకస్మికంగా స్వదేశానికి రప్పించాలన్న బోర్డు నిర్ణయాన్ని తప్పుపట్టారు. ఈ అనూహ్య పరిణామాల నేపథ్యంలోనే ఆయన సెలెక్టర్ పదవికి సైతం రాజీనామా చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. సెలెక్షన్ కమిటీ సభ్యులందరికీ పీసీబీ షోకాజ్ నోటీసులు జారీ చేయడంపై మిస్బా తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రతికూల పరిస్థితులలో కూడా హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌ను బాధ్యతల నుంచి తప్పించడం సరికాదని అన్నారు. ఓటమి ఎదురైన ప్రతిసారీ వ్యవస్థలో లోపాలను సరిదిద్దకుండా తాత్కాలిక మార్పులకే బోర్డు ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు. విదేశాల నుంచి వచ్చే కోచ్‌లకు బోర్డు అపరిమితమైన అధికారాలను ఇస్తోందని, ఒకవేళ జట్టు విఫలమైనా వారిపై ఎలాంటి బాధ్యతను మోపట్లేదని మండిపడ్డారు. అదే సమయంలో సొంత కోచ్‌లకు మాత్రం కనీస మద్దతు ఇవ్వట్లేదని, ప్రతి చిన్న దానికి వారిని బోనులో నిలబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను విదేశీ కోచ్‌ల నియామకాన్ని తప్పుబట్టట్లేదని, విదేశీ కోచ్‌ల పట్ల కొంత సాఫ్ట్ కార్నర్ ఉంటోందని వ్యాఖ్యానించారు. అదే స్థానిక కోచ్‌ల విషయానికి వస్తే ప్రతి ఒక్కరూ వారిని విమర్శించడమే పనిగా పెట్టుకుంటారని చెప్పారు. ఈ సందర్భంగా భారత క్రికెట్ బోర్డు అనుసరిస్తోన్న విధానాలను మిస్బా ఉదహరించారు. భారత జట్టు ప్రస్తుతం ప్రపంచ క్రికెట్‌లో అగ్రస్థానంలో కొనసాగడం వెనుక దశాబ్దాల కఠోర శ్రమ ఉందని అన్నారు. 1990ల నుంచి భారత్ తమ క్రికెట్ నిర్మాణంపై దృష్టి పెడుతూ వచ్చిందని, దాని ఫలితాల వల్లే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి గొప్ప ఆటగాళ్లు పుట్టుకొచ్చారని గుర్తుచేశారు. పాకిస్తాన్ క్రికెట్‌లో ప్రస్తుతం యువ ఆటగాళ్లకు టెస్ట్ క్రికెట్ ఆడే అవకాశం చాలా తక్కువగా లభిస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నేటి తరం ఆటగాళ్లు ఎక్కువగా పరిమిత ఓవర్ల క్రికెట్‌కే ప్రాధాన్యత ఇస్తోన్నారని, దీనివల్ల టెస్ట్ ఫార్మట్ లో రాణించే నైపుణ్యాలు కొరవడుతున్నాయని విశ్లేషించారు. ఒత్తిడిని తట్టుకోలేకపోవడానికి ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడకపోవడమే కారణమని చెప్పారు. పాకిస్తాన్ క్రికెట్ పూర్వవైభవాన్ని సంతరించుకోవాలంటే పీసీబీ తన విధానాలను మార్చుకోవాల్సి ఉంటుందని మిస్బా సూచించారు. ఆకస్మిక మార్పులతో ఆటగాళ్లలో భయాందోళనలు పెరుగుతాయే ఒరిగేదేమీ ఉండదని, యువ ఆటగాళ్లకు ఎక్కువ టెస్టు మ్యాచ్‌లు ఆడేలా ప్రోత్సహించాలని చెప్పారు.

# 27న పింక్ పవర్ రన్



### • పాల్గొననున్న 20 వేల మంది రన్నర్లు

**హైదరాబాద్ :** ఈ నెల 27న హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో జరుగనుందని నిర్వాహకులు ఎంఈఐఎల్ డైరెక్టర్ సుధా రెడ్డి వెల్లడించారు. ఎంఈఐఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పింక్ పవర్ రన్ మూడో ఎడిషన్‌లో సుమారు 20 వేల మంది రన్నర్లు పోటీపడతారని, రూ.75 లక్షల భారీ నగదు బహుమతి అందించనున్నారు. పింక్ పవర్ రన్‌లో తొలిసారి హాఫ్ మారథాన్ (21.097 కిమీ) నిర్వహించనున్నారు. 10కె, 5కె, 3కె ఈవెంట్లు సైతం ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో 2025 మిస్ వరల్డ్ ఒపల్ సుచతా చువాంత్, రొమ్ము క్యాన్సర్ సర్జన్ డాక్టర్ ప్రజ్ఞ చిగురుపాటితో కలిసి సుధా రెడ్డి పింక్ పవర్ రన్ జెర్సీ, మెడల్స్ ఆవిష్కరించారు.

# పట్టుబిగించిన ఈస్ట్ జోన్..

దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్లో ఇషాన్ కిషన్ సారథ్యంలోని ఈస్ట్ జోన్ పట్టుబిగించింది. ముందుగా బ్యాటింగ్‌లో సత్తా చాటి కొండంత స్కోర్ చేసిన ఈస్ట్ జోన్.. ఆ తర్వాత బౌలింగ్‌తో సౌత్ జోన్ పని పట్టింది. దాంతో చెన్నై వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ విజయం దిశగా దూసుకెళ్తోంది. ఈస్ట్ జోన్ బౌలర్లు మహమ్మద్ షమీ(2/17), ముఖేష్ కుమార్(2/36) నిప్పులు చెరగడంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 80 ఓవర్లలో 6 వికెట్లకు 242 పరుగులే చేసింది. క్రీజులో తిలక్ వర్మ(133 బంతుల్లో 5 ఫోర్లతో 56 బ్యాటింగ్), సీవీ మిలింద్(2 బ్యాటింగ్) ఉన్నారు. ఈస్ట్ జోన్ బౌలర్లలో షమీ, ముఖేష్ కుమార్‌తో పాటు ఖురైషి, శిఖర్ మోహన్ తలో వికెట్ తీసారు. సౌత్ జోన్ ఇంకా 466 పరుగుల వెనుకంజలో ఉంది. ఈస్ట్ జోన్ నిర్దేశించిన 708 పరుగుల భారీ స్కోర్‌ను అధిగమించేందుకు మూడో రోజు తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌత్ జోన్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు.



బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న వికెట్‌పై సౌత్ జోన్ బ్యాటర్లు తీవ్రంగా నిరాశపర్చారు. ఓపెనర్ రికీ భుయ్(1) ఆరంభంలోనే వెనుదిరగ్గా.. నారయణ్ జగదీషన్, దేవదత్ పడిక్కల్ ఆచితూచి ఆడారు. హాఫ్ సెంచరీ దిశగా సాగిన నారయణ్ జగదీషన్(32)ను శిఖర్ మోహన్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. మరోవైపు షేక్ రషీద్‌తో కలిసి పడిక్కల్ 65 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. దాంతో సౌత్ జోన్ 115/2 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్ ఆరంభంలోనే షేక్ రషీద్(27)ను మహమ్మద్ షమీ వికెట్ల ముందు బోల్తా కొట్టించగా.. సెంచరీ దిశగా సాగిన పడిక్కల్‌ను ముఖేష్ కుమార్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో 3 పరుగుల వ్యవధిలోనే సౌత్ జోన్ రెండు వికెట్లు కోల్పోయింది. ఈ పరిస్థితుల్లో తిలక్ వర్మ, రవిచంద్రన్ స్మరణ్ ఆచితూచి ఆడే ప్రయత్నం చేశారు. క్రీజులో సెట్ అయిన ఈ జోడీని షమీ విడదీసాడు. రవిచంద్రన్(23) కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. అనంతరం శ్రేయస్ గోపాల్ క్రీజులోకి రాగా.. తిలక్ వర్మ ఆచితూచి ఆడటంతో సౌత్ జోన్ 176/5 టీ బ్రేక్‌కు వెళ్లింది. ఆఖరి సెషన్‌లో సమయోచితంగా బ్యాటింగ్ చేసిన ఈ జోడీ ఇన్నింగ్స్ నిలబెట్టే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో తిలక్ వర్మ 123 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆచితూచి ఆడిన శ్రేయస్ గోపాల్‌ను ఖురైషి ఔట్ చేసి ఆరో వికెట్‌కు నమోదైన 66 పరుగుల భాగస్వామ్యానికి తెరదించాడు. చామ మిలింద్‌తో కలిసి తిలక్ వర్మ ఒంటరి పోరాటం చేశాడు. అసలు సిసలు టెస్ట్ బ్యాటింగ్‌తో ఈస్ట్ జోన్ బౌలర్ల సహనాన్ని పరీక్షించాడు. మరో వికెట్ పోకుండా మూడో రోజు ఆటను ముగించాడు.



# చిరు కూతురు

# 'అమ్ములు'గా అనశ్వర..

## 'కాకా' నుంచి ఫస్ట్ లుక్ విడుదల

మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తున్న భారీ చిత్రం 'కాకా' నుంచి కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో చిరంజీవి కూతురిగా నటిస్తున్న మలయాళ నటి అనశ్వర రాజన్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. నేడు ఆమె పుట్టినరోజు సందర్భంగా 'అమ్ములు' పాత్రను పరిచయం చేస్తూ ఈ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. విడుదలైన పోస్టర్‌లో అనశ్వర రాజన్ మెడికల్ కాలేజీ విద్యార్థినిగా అమాయకమైన లుక్‌లో ఆకట్టుకుంటున్నారు. ఆమె నవ్వుతూ కనిపిస్తుండగా, వెనుక రక్షణ కవచంలా మెగాస్టార్ చిరంజీవి నీడ కనిపిస్తోంది. ఈ పోస్టర్ కూతురి జీవితంలో తండ్రి ప్రాముఖ్యతను, వారి మధ్య ఉండే బలమైన అనుబంధాన్ని తెలియజేసేలా ఉంది. సినిమాలో ఆమె పాత్ర కథాగమనంలో చాలా కీలకమని చిత్ర యూనిట్ పేర్కొంది. తన సహజ నటనతో మలయాళంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న అనశ్వర రాజన్, 'ఛాంపియన్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. ఇప్పుడు ఏకంగా మెగాస్టార్ సినిమాలో అత్యంత ముఖ్యమైన పాత్రను దక్కించుకోవడం ఆమె కెరీర్‌కు పెద్ద ప్లస్ కానుంది.

బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో కీలక సన్నివేశాల చిత్రీకరణ వేగంగా జరుగుతోంది. తండ్రీకూతుళ్ల భావోద్వేగాలతో పాటు మాస్ యాక్షన్ అంశాలతో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఈ చిత్రాన్ని 2027 జనవరి 13న సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు

# చరిత్రలో తొలిసారి..

## ఢిల్లీ దాటుతున్న జాతీయ చలనచిత్ర అవార్డుల వేడుక




జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవం విషయంలో దశాబ్దాలుగా పాటిస్తున్న సంప్రదాయానికి ఈ ఏడాది తెరపడనుంది. చరిత్రలో తొలిసారిగా ఈ ప్రతిష్ఠాత్మక వేడుకను దేశ రాజధాని ఢిల్లీ నుంచి తరలిస్తున్నారు. 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల కార్యక్రమాన్ని గుజరాత్‌లోని ఏక్తా నగర్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. స్టాట్యూ ఆఫ్ యూనిటీ ఉన్న ప్రదేశం ఇదే కావడం గమనార్హం.

ఈ నెలలో గుజరాత్ పర్యటనకు వెళ్లనున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, అక్కడే అవార్డులను ప్రదానం చేస్తారని తెలుస్తోంది. పర్యటనలో భాగంగా ఆమె ఏక్తా నగర్‌కు వెళ్లి విజేతలకు పురస్కారాలు అందజేయనున్నట్టు సమాచారం. సాధారణంగా ఏటా ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుంది. అయితే, ఈసారి అందుకు భిన్నంగా వేదికను మార్చడం ప్రాధాన్యం సంతరించుకుంది.

2024 సంవత్సరానికి గాను 72వ జాతీయ చలనచిత్ర అవార్డులను జులై నెలలో ఢిల్లీలో ప్రకటించారు. 'ఆర్టికల్ 370' ఉత్తమ చిత్రంగా నిలవగా, యామీ గౌతమ్ ఉత్తమ నటి అవార్డును గెలుచుకుంది. మలయాళ అగ్రనటుడు మమ్ముట్టి, బాలీవుడ్ హీరో కార్తీక్ ఆర్యన్ ఉత్తమ నటుడి అవార్డును పంచుకున్నారు. కాగా, 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ – ఏక్తా కా ప్రతీక్' అనే చిత్రానికి గాను దర్శకుడు ఆనంద్ ఎల్. రాయ్ నాన్-ఫీచర్ విభాగంలో ఉత్తమ దర్శకత్వ పురస్కారం అందుకోవడం విశేషం.



# చీరకట్టులో ఆకట్టుకుంటున్న

# ఆషికా రంగనాథ్..


కన్నడ నటిగా పాపులారిటీ అందుకున్న ఆషికా రంగనాథ్ తొలిసారి కళ్యాణ్ రామ్ కథానాయకుడిగా వచ్చిన అమీగోస్ అనే చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించింది. సినిమా డిజాస్టర్ గా నిలిచినా అందరి దృష్టి అమ్మడి పైనే. తన నటనతో, అందంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈమె.. మళ్లీ 2026లో భర్త మహాశయులకు విజ్ఞప్తి అనే సినిమాలో నటించింది . ఈ సినిమా కూడా పెద్దగా ప్రేక్షకులను ఆకట్టుకోలేదు. ప్రస్తుతం వశిష్ట మల్లిడి దర్శకత్వంలో విశ్వంభర అనే సినిమా చేస్తోంది. కానీ ఈ సినిమా విడుదలకు నోచుకోలేదు. దీంతో రూట్ మార్చిన ఈమె.. తమిళంలో తాజాగా నటిస్తున్న చిత్రం సర్దార్ 2 . సెప్టెంబర్ 10వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో అటు ప్రమోషనల్ కార్యక్రమాలతో పాటు ఇటు సోషల్ మీడియా వేదికగా సందడి చేస్తూ అలరిస్తోంది. ఈ మేరకు తాజాగా చీరకట్టులో ఆడియన్స్ ను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది ఆషికా రంగనాథ్. బ్లాక్ అండ్ వైట్ జీబ్రా కలర్స్ తో డిజైన్ చేసిన జార్జెట్ చీర కట్టుకున్న ఈమె.. దీనికి కాంబినేషన్లో పోల్కా డాటెడ్ తో డిజైన్ చేసిన డీప్ రౌండ్ నెక్ కలిగిన బ్లౌజ్ ధరించి తన అందాలను ఫుల్ ఫిల్ చేసుకుందిహైదరాబాదులో సెప్టెంబర్ 7న జరిగిన సర్దార్- 2 ప్రీ రిలీజ్ ఈవెంట్ కోసం ఇలా ముస్తాబయింది ఈ ముద్దుగుమ్మ. చీర కట్టులో నడుము అందాలతో చక్కగా ప్రేక్షకులను మైమరిపింప చేసిన ఆషికా రంగనాథ్ ఈ ఫోటోలకు క్యాప్షన్ గా సినిమాటిక్ గా ఉందా? హైదరాబాదులో సర్దార్ 2 ప్రీ రిలీజ్ ఈవెంట్ కోసం ఈ లుక్ అంటూ షేర్ చేసిన క్యాప్షన్ ఆకట్టుకుంటుంది. మొత్తానికి అయితే ఆషికా రంగనాథ్ షేర్ చేసిన ఈ లేటెస్ట్ అవుట్ ఫిట్ ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఇకపోతే ప్రీ రిలీజ్ ఈవెంట్లో తన అంద చందాలతో ఆషికా ఆకట్టుకున్న విషయం తెలిసిందే

పిఎస్ మిత్రాన్ దర్శకత్వంలో గతంలో వచ్చిన సర్దార్ మూవీకి సీక్వెల్ గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. తమిళ్ భాష స్పై యాక్షన్ థ్రిల్లర్ మూవీగా రాబోతున్న ఈ చిత్రాన్ని ప్రిన్స్ పిక్చర్స్, ఐవి ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్లపై నిర్మించారు. ఇందులో కార్తీ సరసన రజీషా విజయన్ తన మునుపటి పాత్రనే తిరిగి పోషిస్తుండగా.. మాళవిక మోహనన్.. ఆషికా రంగనాథ్ ఈ చిత్రంలో అదనంగా చేరారు.. ఈ చిత్రానికి సిఎస్ సంగీతాన్ని అందిస్తుండగా .. జార్జ్ సి విలియమ్స్ సినిమాటోగ్రఫీ అందించారు. విజయ్ వెళకుట్టి ఎడిటింగ్ నిర్వహించారు. భారీ అంచనాల మధ్య సెప్టెంబర్ 10న రాబోతున్న ఈ సర్దార్ 2.. సర్దార్ కు మించి సక్సెస్ అందుకోవాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

# 75 ఏళ్ల వయసులోనూ

# ఫిట్‌నెస్ ఐకాన్..

## మమ్ముట్టి యంగ్ లుక్



మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి సెప్టెంబర్ 7న 75వ వసంతంలోకి అడుగుపెట్టారు. ఈ వయసులోనూ ఆయన ఫిట్‌నెస్, యంగ్ లుక్ చూసి సినీ పరిశ్రమ, అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. కండరాల బలం, శారీరక చురుకుదనం సహజంగా తగ్గే వయసులో కూడా ఆయన ఎంతో ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండటం వెనుక ఒక క్రమశిక్షణతో కూడిన జీవనశైలి ఉంది. పరిమితంగా ఆహారం తీసుకోవడం, క్రమం తప్పని వ్యాయామం, సరైన నిద్ర వంటి అలవాట్లే ఆయన ఫిట్‌నెస్ రహస్యాలుగా తెలుస్తోంది.

**సూర్యకు స్ఫూర్తినిచ్చిన మమ్ముట్టి**

తమిళ స్టార్ హీరో సూర్య సైతం మమ్ముట్టి ఆహారపు అలవాట్ల నుంచి స్ఫూర్తి పొందినట్లు గతంలో ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. "ఇష్టమైనది ఏదైనా తినొచ్చు, కానీ ఇష్టమొచ్చినంత తినకూడదు, కడుపు సగం నిండే వరకే తినాలి" అని మమ్ముట్టి తనకు సలహా ఇచ్చినట్లు సూర్య గుర్తుచేసుకున్నారు. పూర్తిగా మానేయడం కంటే, పరిమితంగా తినడమే మమ్ముట్టి డైట్‌లో కీలక సూత్రం.

**డైట్ ప్లాన్ ఎలా ఉంటుంది?**

కొన్ని నివేదికల ప్రకారం, మమ్ముట్టి నూనెలో వేయించిన పదార్థాలకు, చక్కెర, కొవ్వు ఎక్కువగా ఉండే ఆహారానికి దూరంగా ఉంటారు. పండ్లు, కూరగాయలు, గుడ్లు, చేపలు, నట్స్ వంటి పోషకాహారానికి ప్రాధాన్యత ఇస్తారు. ఉదయం అల్పాహారంలో ఓట్స్ జావ, గుడ్డులోని తెల్లసొన, బొప్పాయి, నానబెట్టిన బాదం వంటివి తీసుకుంటారు. మధ్యాహ్నం అన్నానికి బదులుగా ఓట్స్ పుట్టుతో పాటు తక్కువ మసాలాతో వండిన చేపల కూర తింటారు. రాత్రిపూట గోధుమ లేదా ఓట్స్ దోశలతో చికెన్ లేదా చేపల కూర తీసుకుని, తేలికపాటి ఆహారంతో సరిపెడతారు. ఆయన వ్యక్తిగత చెఫ్ చెప్పిన ప్రకారం, వేయించిన చేపల కంటే చేపల పులుసునే ఆయన ఇష్టపడతారు.

**వ్యాయామం, నిద్రకు అధిక ప్రాధాన్యం**

ఆహార నియమాలతో పాటు, మమ్ముట్టి రోజూ జిమ్‌లో వర్కౌట్లు చేస్తారు. వయసు పెరిగేకొద్దీ కండరాల బలం తగ్గకుండా ఉండేందుకు స్ట్రెంత్ ట్రైనింగ్, కార్డియో వ్యాయామాలు చేస్తుంటారు. ఫిట్‌నెస్ విషయంలో వ్యాయామం ఎంత ముఖ్యమో, శరీరానికి సరైన విశ్రాంతి కూడా అంతే అవసరమని ఆయన నమ్ముతారు. అందుకే, షూటింగ్ షెడ్యూల్స్ ఎంత బిజీగా ఉన్నా, సరైన సమయానికి నిద్రపోవడానికి అధిక ప్రాధాన్యం ఇస్తారు.

మమ్ముట్టి 75వ పుట్టినరోజు సందర్భంగా ఆయన కొత్త చిత్రం 'మేళా' టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఒకవైపు నటుడిగా రాణిస్తూనే, మరోవైపు ఆరోగ్యకరమైన జీవనశైలితో ఆయన ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

# పిఠాపురంలో అలా మొదలైంది..

## మళ్లీ ఫ్యామిలీ కథతో మహేష్ చంద్ర



ప్రేయసి రావే సినిమాతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న మహేష్ చంద్ర ఇప్పుడు మరో ఫ్యామిలీ కథతో వస్తున్నారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన పిఠాపురంలో అలా మొదలైంది సెప్టెంబర్ 18న థియేటర్లలోకి రానుంది. ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తోంది. టైటిల్ నుంచే కథకు పిఠాపురం నేపథ్యం ఉందని అర్థమవుతోంది. ప్రేమ, కుటుంబం, సరదా సన్నివేశాలతో పాటు తండ్రి, కూతురు మధ్య అనుబంధం ఈ కథలో ముఖ్యంగా ఉండబోతోంది. 00:05 / 02:25 రాజేంద్ర ప్రసాద్ ఇందులో కీలక పాత్రలో నటించారు. పృథ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన, అన్నపూర్ణమ్మతో పాటు సన్నీ అఖిల్, విరాట్, జూనియర్ పవన్ కల్యాణ్, సాయి ప్రణీత్, శ్రీలు, ప్రత్యూష, రెహానా ఇతర




పాత్రల్లో కనిపించనున్నారు. ఒక కుటుంబంలో మనకు రోజూ ఎదురయ్యే మనుషులు, పరిస్థితులకు దగ్గరగా పాత్రలను రాసినట్టు దర్శకుడు చెబుతున్నారు. ఇప్పటి యువతకు చెప్పాల్సిన ఒక విషయాన్ని కూడా కథలో భాగంగా తీసుకున్నారట. మహేష్ చంద్ర పేరు చెప్పగానే చాలామందికి ప్రేయసి రావే గుర్తుకొస్తుంది. ప్రేమకథతో పాటు ఫ్యామిలీ ఎమోషన్స్ తో వచ్చిన ఆ సినిమా అప్పట్లో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఇప్పుడు కూడా ఆయన పూర్తిగా కుటుంబ కథనే ఎంచుకున్నారు. కాకపోతే ఈసారి తండ్రి, కూతురు బంధాన్ని కథలో హైలెట్ చేశారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌లో కూడా ఇంట్లో జరిగే సరదా గొడవలు, పెళ్లి చుట్టూ వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613